

పత్తి రైతుకు దన్ను



- కనీస మద్దతు ధర లభ్యం
- అందుబాటులోకి కపాస్ కిసాన్ యాప్
- దళారులకు అడ్డుకట్ట వేస్తూ సీసీఐ నిర్ణయం
- ఈ ఏడాది క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.8,110

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం కష్టపడి తెల్లబంగారాన్ని పండించినా నష్టపోతోన్న రైతన్నకు దన్ను ఇచ్చేలా.. దళారుల దోపిడీని అరికట్టేలా.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పత్తి రైతులందరూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పొందేందుకు వీలుగా 'కపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో నమోదు చేసుకుని రైతులు తాము పండించిన పత్తిని కనీస మద్దతు ధరకు నేరుగా విక్రయించేందుకు తొలిసారిగా ఈ యాప్‌ను సీసీఐ అందుబాటులోకి తెచ్చింది. రైతులకు మద్దతు ధర దక్కేలా చేయడమే ఉద్దేశంగా సీసీఐ ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధరకు పత్తిని విక్రయించే దళారీలకు అడ్డుకట్ట పడనున్నది. కనీస మద్దతు ధర పథకం కింద పత్తి సాగుదారులు ప్రయోజనాలను పొందడానికి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సీసీఐ అభ్యర్థిస్తోంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ ద్వారా లాగిన్ అవ్వాలి. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.8,110గా ప్రకటించింది. కనీస ధర పొందాలంటే యాప్‌లో ముందుగా రిజిస్టర్ అయిన రైతులు పత్తి విక్రయ సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఏ రోజు సీసీఐ కేంద్రంలో వారు పత్తి విక్రయించాలో వివరాలు తెలుపుతూ యాప్ సమాచారం ఇస్తుంది. ఇలా చేయడం వల్ల రోజుల తరబడి నిరీక్షించాల్సిన బాధ రైతులకు తప్పుతుంది. స్లాట్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. వేసవిలో సాగు చేసిన పత్తి మొదటి దశ కాపు పత్తి తీస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వివిధ దశల్లో పత్తి సాగు ఉంది. అయితే యాప్ విధానం బాగున్నా అందరి వద్ద స్మార్ట్‌ఫోన్లు లేవని రైతులు చెబుతున్నారు. స్మార్ట్ మొబైల్ ఉన్న రైతులకు మాత్రమే ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఈ పరిస్థితుల్లో రైతులకు యాప్ వినియోగంపై వ్యవసాయశాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.



● బీచ్‌లో జరుగుతున్న మెరక పనులు

బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

ముస్తాబవుతున్న సూర్యలంక తీరం

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బీచ్‌ఫెస్టివల్‌కు సూర్యలంక సముద్రతీరం ముస్తాబవుతోంది. ఈ నెల 26, 27, 28 తేదీల్లో బీచ్‌ఫెస్టివల్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తీరంలో విశాలమైన భూభాగాన్ని చదును చేశారు. మెరకలు నిమిత్తం మట్టిని తవ్వి గుంతలలో పోసి చదును చేస్తున్నారు. అటు సముద్రం దగ్గర నుంచి ఇటు మత్స్యకారుల నివాసాల వరకు, మరోవైపు ఆక్వాచెరువులకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి వరకు మొత్తాన్ని ఏకచదరం చేస్తున్నారు. బీచ్‌ఫెస్టివల్‌కు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా ఇవ్వడంతో పనులపై నిత్యం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బీచ్‌ఫెస్టివల్‌ను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లను శరవేగంగా చేపడుతున్నారు. 27న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూర్యలంకబీచ్‌ని సందర్శించనున్నారు. రూ.97.52 కోట్లతో పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేసేందుకు కూడా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

బీచ్‌ఫెస్టివల్ వేడుకలకు తీరంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. వేడుకలకు ముఖ్యమంత్రి విచ్చేయుచున్న నేపథ్యంలో తీరంలో తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ గురువారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్, సీఎం కాన్వాయ్ ప్రయాణించే మార్గం, సభావేదిక, స్టాల్స్ ప్రదేశం, హెలీప్యాడ్, సూర్యలంక మెరైన్ పోలీసుస్టేషన్లను ఎస్పీ పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు. తీరంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న 15మంది గజఈతగాళ్లతోపాటు అదనంగా మరికొంత మందిని నియమించుకోవాలన్నారు. నిర్దిష్ట లోతులో జెండాలు ఏర్పాటు చేసి అక్కడ పడవలలో పోలీసు సిబ్బంది, గజఈతగాళ్ళతో గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ జి.రామాంజనేయులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



తీరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్, డీఎస్పీ జి.రామాంజనేయులు



ఎన్‌ఎంఎంఎస్‌కు శిక్షణ అందిస్తున్న ఉపాధ్యాయులు

ఉపకారం.. ప్రోత్సాహం

ఎన్‌ఎంఎంఎస్‌పై విద్యార్థులకు శిక్షణ ● ఇప్పటికే జిల్లాలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ● అక్టోబరు 30 వరకు గడువు.. డిసెంబరు 7న పరీక్ష

చీరాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన సమస్యలతో విద్యార్థులు బడి మానేయకుండా వారికి ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కం మెరిట్(ఎన్‌ఎంఎంఎస్) ఉపకార వేతనాలు అందిస్తోంది. ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాలతో ఎంతోమంది విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది. ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు నాలుగేళ్లు రూ.12 వేల చొప్పున విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఈ ఏడాదికి ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి అక్టోబరు 30 వరకు దరఖాస్తులకు సమయం ఇవ్వగా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబరు 7న పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తున్నారు.

అర్హత సాధించేలా శిక్షణ



ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభ పరీక్షలో జిల్లాకు చెందిన విద్యార్థులు పెద్దసంఖ్యలో అర్హత సాధించేలా శిక్షణ ఇస్తున్నాము. ఇప్పటికే అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు సూచనలు కూడా చేశాము. శిక్షణకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవు తున్నారు. కొందరు ఉపాధ్యాయులు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి శిక్షణ ఇస్తున్నారు.

- శ్రీరాం పురుషోత్తం, డీఈవో, బాపట్ల

అందుబాటులో 366 ఎంటీల యూరియా

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 366 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. రైతులు పంట విత్తిన పొలాలకు సరిపడ యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 2075 మంది రైతులకు 259.170 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ జరిగిందన్నారు.

మాచర్లకు రేపు ముఖ్యమంత్రి

మాచర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఈ నెల 20న మాచర్ల పట్టణంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీశైలం రోడ్డులోని కస్తూర్బా పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఎస్‌కేబీఆర్ గ్రౌండ్‌లో బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెయింట్ ఆన్ స్కూల్ ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగమంతా మాచర్లకు చేరుకుంది. శుక్రవారానికి ఏర్పాట్లు పూర్తి చేసేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టనున్నారు.

మరింత 'జనరల్'గా 'టిక్కెట్' బుకింగ్..!

- రైల్వే సిబ్బంది వీపు భాగాన క్యూఆర్ కోడ్
- స్కాన్ చేసి జనరల్ టిక్కెట్‌లు పొందొచ్చు
- పండగల రద్దీ దృష్ట్యా.. రైల్వే నిర్ణయం

గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే పండుగల రద్దీ దృష్ట్యా జనరల్ టిక్కెట్ల బుకింగ్‌ను రైల్వే మరింత సులభతరం చేసింది. యూటీఎస్ యాప్ ద్వారా సులువుగా టికెట్ పొందేందుకు.. కొంతమంది రైల్వే సిబ్బంది ధరించిన దుస్తుల వీపు భాగాన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను రైల్వే శాఖ అతికించింది. దీంతో ప్రయాణికులు రైల్వే స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ఎక్కడ ఉందా అనేది వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. సిబ్బంది ధరించిన జాకెట్ వెనక భాగాన ఉన్న క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి, కాగిత రహిత టిక్కెట్‌ని బుకింగ్ చేసుకోవచ్చు. ఎలాంటి హడావుడి లేకుండా రైలులో ప్రయాణించవచ్చు. రద్దీ అధికంగా ఉండే గుంటూరు రైల్వేస్టేషన్‌లోనూ ఈ సదుపాయాన్ని ప్రయాణికులకు అందు బాటులోకి తీసుకొచ్చారు. సిబ్బంది ధరించిన రెట్రో రిఫ్లెక్టివ్ జాకెట్లు వెనుక వైపున మాత్రమే క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. యూటీఎస్/రైల్‌వన్ యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, జనరల్ టిక్కెట్లను బుక్ చేసుకునేలా సౌకర్యం కల్పించింది. స్టేషన్ కాన్ కోర్స్ ప్రాంతంలో నియమించబడిన వ్యక్తులు ఈ జాకెట్లను ధరిస్తారు. యూటీఎస్, రైల్‌వన్ యాప్‌ల ద్వారా టిక్కెట్లను కొనుగోలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి సిబ్బంది వారికి మార్గనిర్దేశం చేస్తారు. ఈ ముఖాముఖీ విధానం వల్ల యాప్‌లు వినియోగదారు - స్నేహపూర్వక లక్షణాల గురించి, ముఖ్యంగా క్యూఆర్ కోడ్ ఆధారిత టికెటింగ్ గురించి ప్రయాణికులలో అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది. ఇది టికెట్ కౌంటర్ల వద్ద క్యూలను తగ్గించడానికి, నగదు రహిత, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి సహాయపడుతుంది.



రెట్రో రిఫ్లెక్ట్ జాకెట్ వెనక వైపున అతికించిన క్యూఆర్ కోడ్

సులభంగా టిక్కెట్ బుకింగ్..

జనరల్ టిక్కెట్ల కొనుగోలు కోసం మొదట విధించిన దూర పరిమితులను రైల్వే శాఖ ఇప్పుడు సడలించింది. రైలు వినియోగదారులు ఇప్పుడు స్టేషన్ ప్రాంగణం /రైల్వే ట్రాక్ నుంచి 5 మీటర్ల దూరంలో ఉన్న ఏ ప్రదేశం నుంచైనా టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు. సరళంగా చెప్పాలంటే, ప్రయాణికుడు తమ ఇంటి నుంచే టిక్కెట్లను (జర్నీ/ప్లాట్‌ఫాం/సీజన్) బుక్ చేసుకోవచ్చు. ప్రయాణికులు ఆర్-వాలెట్, పేటీఎం, యూపీఐ/ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి వివిధ డిజిటల్ విధానాల ద్వారా చెల్లింపు చేయవచ్చు. ఆర్-వాలెట్ ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసినప్పుడు 3 శాతం బోనస్ కూడా క్రెడిట్ చేయబడుతుంది.

బాపట్లలో రేపు జాబ్‌మేళా

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాల్వేషన్ ఆర్మీ ఐటీఐ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.మాధవి తెలిపారు. జాబ్‌మేళాకు అరబిందో ల్యాబ్స్ ముత్తూట్ ఫైనాన్స్ రిలయన్స్ ట్రెండ్, వరుణ్ మోటార్స్, రాయల్ మెరైన్, టీవీఎస్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎన్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్ కంపెనీలు హాజరై 500 మందికిపైగా నియామకాలు చేపడతా యన్నారు. విద్యార్హతను బట్టి రూ.12 వేలు నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ చదువుకున్న 18నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు వచ్చేవారి వద్ద ఆధార్‌లింక్ అయిన మొబైల్ అందుబాటులో తప్పనిసరిగా ఉండాలన్నారు. వివరాలకు 9640695229 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేరస్తులపై కఠిన చర్యలు

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరిక ● పట్టణ, రూరల్, సర్కిల్ స్టేషన్లలో తనిఖీ

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. బాపట్ల పట్టణ, రూరల్, సర్కిల్ పోలీసు స్టేషన్లను గురువారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో పోలీసులకు పట్టుబడి పట్టణ పోలీసుస్టేషన్‌లో పాడైపోతున్న ద్విచక్రవాహనాలను పరిశీలించి దీర్ఘకాలంగా ఉన్న వాటిని డిస్పోజ్ చేయాలన్నారు. రూరల్ పోలీసుస్టేషన్‌లో ఉమెన్‌హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి మహిళా కానిస్టేబుల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, సీఐలు జి.నారాయణ, ఆర్.రాంబాబు, హరికృష్ణ, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణ, రూరల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లతో మాట్లాడుతున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బౌద్ధరామ అభివృద్ధికి కృషి

● భట్టిప్రోలు బౌద్ధక్షేత్ర సందర్శనలో ఎంపీ కృష్ణప్రసాద్

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలులోని బౌద్ధరామ క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం గ్రామంలోని బౌద్ధస్థూపాన్ని సందర్శించిన ఎంపీ స్థూపం చుట్టూ ప్రదక్షిణ చేసి, పురావస్తుశాఖ ఏర్పాటు చేసిన లిపిని పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ 2014-19 మధ్య కాలంలో బౌద్ధస్థూపం అభివృద్ధి కొంత మేర జరిగిందన్నారు. అనంతరం ఏర్పడిన ప్రభుత్వం స్థూపం అభివృద్ధిపై చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి బౌద్ధ స్థూపం విషయాన్ని తీసుకు వెళ్లి గతంలో ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభింపచేస్తానన్నారు. ఇందుకు కేంద్ర నిధులను సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. తథాగతుని విగ్రహం, గ్రంథాలయం ఏర్పాటుతో పాటు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పర్యాటక కేంద్రంగా భట్టిప్రోలును తీర్చిదిద్దేందుకు అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల ఉపాధ్యక్షుడు యడ్ల జయశీలరావు, నాయకులు డొక్కు శ్రీనివాసరావు, కొలుసు పోతురాజు, వై.పాండురంగారావు, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిపై నేతలతో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్

అనధికారికంగా.. ఆక్వా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

'ఆక్వా రంగం తీవ్రమైన ఒడిదుడుకుల్లో ఉంది. దానిని సంక్షోభం నుంచి బయటపడేయాలంటే ముందు చెరువుల రిజిస్ట్రేషన్ పక్కాగా జరగాలి..' అని ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు ఆక్వా సాగును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు. రొయ్యల సాగుకు సంబంధించి ప్రతీ ఎకరం రిజిస్ట్రేషన్ ద్వారా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం సులభంగా ఉంటుందనేది ప్రభుత్వ ఆలోచన. అయితే జిల్లావ్యాప్తంగా అనధికారికంగా పెద్దఎత్తున ఆక్వా చెరువులు ఉన్నాయి. ఏళ్ల తరబడి నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల సాగు చేపడుతున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. ముఖ్యంగా కోర్టు పరిధిలో ఉన్న వాన్‌పిక్ భూములను కూడా వదలకుండా వాటిని చెరువులుగా మార్చారు. అసైన్డ్ భూములు కూడా రొయ్యలు చెరువుల్లా మారాయి. నిజాంపట్నం మండల పరిధిలోని దిండి, కొత్తపాలెంతో పాటు చీరాల నియోజకవర్గంలో కూడా వేల ఎకరాలు వాన్‌పిక్‌కు కేటాయించిన దాదాపు 5,000 ఎకరాల్లో అనధికారికంగా రొయ్యల సాగు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలా చెరబట్టిన వాటిలో దాదాపు 80 శాతం రాజకీయ నేపథ్యం ఉన్నవారివే కావడంతో యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. వీటిని రిజిస్ట్రేషన్ చేయడానికి నిబంధనలు ఒప్పుకోవు. ఇక అసైన్డ్ భూముల విషయానికి వస్తే దాదాపు పదివేల ఎకరాలలో అడ్డగోలు రొయ్యల సాగు జరుగుతున్నప్పటికీ మత్స్యశాఖ లెక్కల్లో ఇది 3,000 ఎకరాలకే పరిమితమైంది. వీటి రిజిస్ట్రేషన్ విషయంలోనూ అనేక ప్రతిబంధకాలు ఉన్నాయి. అసైన్డ్ భూముల క్రయవిక్రయాలన్నీ అనధికారిక అగ్రిమెంట్ల ద్వారానే జరుగుతుంటాయి. నిబంధనల ప్రకారం వీటిని నమోదు చేయాలంటే అనుభవదారు సర్టిఫికెట్ ఉండాలి. ఇది రెవెన్యూశాఖ జారీ చేస్తే మత్స్యశాఖ రిజిస్ట్రేషన్ చేస్తుంది. ఇది కూడా కేవలం ఒరిజినల్ అసైనీ వారసులకే ఈ వెసులుబాటు అని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఇప్పటికే అసైన్డ్ భూములు మూడు, నాలుగు చేతులు మారి ఉండడంతో క్షేత్రస్థాయిలో రిజిస్ట్రేషన్ అనేది సాధ్యపడని విషయంగా తయారైంది. నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలు సాగు ఓ వైపు, సాంకేతిక ప్రతిబంధకాలు మరో వైపు వంద శాతం రొయ్యల సాగు రిజిస్ట్రేషన్ అనేదాన్ని క్లిష్టతరంగా మార్చేశాయి. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలో 22,558 ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతున్నట్లు మత్స్యశాఖ తేల్చింది. ఇందులో సీఏఏ(కోస్తా ఆక్వాకల్చర్ అథారిటీ) లెక్కల ప్రకారం రిజిస్ట్రేషన్ జరిగింది 14,400 ఎకరాలే. గడువు పూర్తయిన వాటిని వెంటనే రెన్యువల్ చేయడంతో పాటు రొయ్యల సాగు మొత్తాన్ని రిజిస్ట్రేషన్ గొడుగు కిందకు తేవాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఏడాది గడువుతో రొయ్యల సాగుకు ఇచ్చే సీఓసీ(కల్టివేషన్ ఆఫ్ సర్టిఫికెట్)కి జిల్లాలో ఒక్క దరఖాస్తు రాకపోవడం గమనార్హం.

- వాన్‌పిక్ భూముల్లో రొయ్యల సాగు
- చెరువుల పక్కా రిజిస్ట్రేషన్ సాధ్యమేనా?
- నిబంధనల ఉల్లంఘన.. నమోదుకు అడ్డంకులు



అడవులదీవి సమీపంలోని వాన్‌పిక్ భూముల్లో అనధికార ఆక్వా సాగు (పాత చిత్రం)

పొంతన లేని లెక్కలు..

ఆక్వా అనధికారిక సాగును కట్టడి చేయాలనే ప్రయత్నమే గత ప్రభుత్వంలో చేయకపోగా అడ్డగోలు సాగుకు గేట్లు ఎత్తేసింది. దీంతో సీఏఏ నిబంధనలు గాలికి కొట్టుకుపోయాయి. రికార్డుల్లో ఉండే లెక్కలకు, వాస్తవ సాగుకు పొంతన లేకపోవడంతో మొత్తం ఆక్వా రంగమే గాడి తప్పింది. ఇక అసైన్డ్ భూముల క్రయవిక్రయాలే నేరమని చట్టం చెబుతుంటే ఏకంగా ఆ భూముల్లో రొయ్యల సాగు తంతు ఏళ్ల తరబడి సాగుతోంది. ఈ అనధికారిక రొయ్యల సాగును క్రమబద్ధీకరించి చిన్న, సన్నకారు ఆక్వా రైతులకు మేలు చేయడంతో పాటు వాస్తవ సాగు ఆధారంగా భవిష్యత్ ప్రణాళికలు రచించి సంక్షోభం నుంచి ఆక్వా రంగాన్ని గట్టెక్కించాలన్నది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇది సాధ్య పడాలంటే ముందుగా అడ్డగోలు సాగుపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించాలి.

మొత్తం రిజిస్ట్రేషన్ సాధ్యపడదు...

ఆక్వా సాగు మొత్తాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలంటే సాధ్యపడదనే అభిప్రాయాన్ని మత్స్యశాఖ వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా వాన్‌పిక్ భూముల్లో రొయ్యల సాగు అంశంలో ఏం చేయాలో పాలుపోవడం లేదని యంత్రాంగం అంటోంది. వాన్‌పిక్ భూములతో పాటు అసైన్డ్ భూముల్లో రొయ్యల సాగు లెక్కలను సమగ్రంగా ప్రభుత్వానికి నివేదించనున్నామని మత్స్యశాఖ చెబుతోంది. ఇప్పటికే ఆక్వా సాగు నమోదుకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నడుస్తోందని, మరో వారం రోజుల్లోనే పూర్తిస్థాయి స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అయితే రిజిస్ట్రేషన్ చేయని చెరువులను ధ్వంసం చేసే అధికారం చట్టం కట్టబెట్టింది. కానీ ప్రభుత్వం వైపు నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే తప్ప వీటి విషయంలో ముందుకెళ్లలేమని అధికారులు చెబుతున్నారు. నెల రోజుల్లోనే ఆక్వా సాగుకు సంబంధించి కచ్చితత్వంతో కూడిన నమోదుతో సిద్ధంగా ఉండాలనే ఆదేశాలు ఇప్పటికే మత్స్యశాఖకు అందాయి. ఇందుకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ కూడా యంత్రాంగం చేపడుతోంది. ఎలా ముందు కెళ్లాలన్న దానిపై యంత్రాంగానికి స్పష్టత లేదు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని భూముల విషయంలో క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికనే ప్రభుత్వానికి ఇవ్వడానికి మత్స్యశాఖ సిద్ధమవుతోంది. దీని ఆధారంగానే అనధికారిక రొయ్యల సాగుపై ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

మనసు పెడితే.. ఆవిష్కరణలు సాధ్యమే

● పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం



గుంటూరు (విద్య) సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మనసు పెడితే.. ఏ ఆవిష్కరణలు అయినా సాధ్యమేనని పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్. ఈ సెల్ ఆధ్వర్యంలో " ఇట్స్ మై స్టోరీ" అనే ఇతివృత్తంతో గురువారం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లేశం మాట్లాడుతూ తన తల్లి గంటల తరబడి కూర్చుని "అసు" పనిని చేస్తుండేదని చెప్పారు. దీని వల్ల ఆమె భుజాలు, చేతులు నొప్పితో బాధపడేవారని తెలిపారు. ఒక చీరకు అసు పోయాలంటే దాదాపు 9 వేల సార్లు చేతిని అటు ఇటూ తిప్పాల్సి వచ్చేద న్నారు. తన తల్లి కష్టాన్ని తగ్గించడానికి యంత్రాన్ని తయారుచేయాలనే సంకల్పం మొదలైందన్నారు. ఎన్నో కష్టాలు, అవాంతారల మధ్య దాదాపు 7 సంవత్సరాల పాటు నిరంతర ప్రయత్నాల తర్వాతనే "అసు యంత్రం" విజయవంతమైందని విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, డైరక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్



అధికారులతో మాట్లాడుతున్న కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండే

విజయపురిసౌత్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను గురువారం కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ బీపీ పాండే సందర్శించారు. సాగర్ డ్యాం క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటిని పరిశీలించారు. సాగర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, 420 గ్యాలరీ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంతో పాటు కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల పనితీరును అధికారులు చైర్మన్ పాండేకు వివరించారు. అనంతరం డ్యాంపై స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఎంబీ సభ్యుడు కేకే జంజిద్, డీఈలు మురళీధర్, స్వరూపరాణి, జేఈ హిమబిందు, భారతి పాల్గొన్నారు.

20 క్రస్ట్ గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



విజయపురిసౌత్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు గురువారం 20 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 588.00 అడుగులు ఉంది.ఇది 306.10 టీఎం సీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 8,629, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,333, 20 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,57,800, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 2,11,962 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,11,962 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 2,03,905 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 13 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 2,03,905 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామని ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబులు చెప్పారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.8237 ఎంయూల విద్యుదుత్పత్తి చేయగా గురువారం ఉదయం నుంచి విద్యుత్ త యారీని నిలిపివేశామన్నారు. ఎగువన సాగర్ నుంచి 2 లక్షల 5 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.36 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.984 టీఎంసీలకు సమానమన్నారు.



టెయిల్ పాండ్ : 13 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కొనసాగుతున్న వరద ఉధృతి



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు, ప్రధాన వాగుల నుండి 1,24,746 క్యూసెక్కుల వరదనీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 1,10,100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 8,124, పశ్చిమ డెల్టాకు 6,522 వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం.. ఉపేక్షించేది లేదు

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న జడ్పీ చైపర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా హెచ్చరించారు. తురక పాలెం ప్రజలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గురువారం గ్రామంలో పర్యటించిన ఆమె గ్రామస్తులతో మాట్లాడారు. మరణాల గల కారణాలపై బాధితులతో మాట్లాడారు. గ్రామంలో సంభవించిన మరణాల పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామంలో సైడ్ కాలువల నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి కొంత నిధులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. గ్రామంలో పరిస్థితిలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని డీఎంఅండ్‌హెచ్ఓ, డీపీఓ, ఎంపీడీవో లకి సూచనలు చేశామని వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అక్కడి పరిస్థితులను చెర్‌పర్సన్‌కు విన్నవించారు. పలకలూరు నుంచి పైపులైన్ ద్వారా తమ గ్రామానికి నీటిని అందించాలని కోరగా అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటానని చైర్ పర్సన్ వివరించారు. అదేవిధంగా ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారి బిల్లులను సీఎంఆర్ఎఫ్ ద్వారా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎం అండ్ హెచ్ఓను కోరారు. పరీక్షల రిపోర్టులను గ్రామస్తుల కోరిక మేరకు అందజేయాలని సూచించారు. అనంతరం రక్షిత మంచినీటి పథకం వద్ద ఆటోమేటిక్ ఫ్లోర్ నేషన్ విధానాన్ని సమీక్షించారు. 24 గంటలు మెడికల్ క్యాంపు, 108 అంబులెన్స్ అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. చెర్‌పర్సన్‌తో పాటు డి ఎం అండ్‌హెచ్ఓ కె.విజయలక్ష్మి, డీపీఓ సాయికుమార్, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

12 అడుగుల కొండచిలువ



కొండ చిలువతో నేచర్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు

విజయపురిసౌత్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఫిల్టర్ హౌస్ వద్ద గురువారం రాత్రి నేచర్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు 12 అడుగుల కొండ చిలువను పట్టుకున్నారు. ఫిల్టర్ హౌస్ వద్ద ఓ దుకాణంలోకి కొండ చిలువ జొరవడడంతో దుకాణం నిర్వాహకుడు సొసైటీ సభ్యులకు సమాచారం అందించారు. సొసైటీ అధ్యక్షుడు మహేష్ ఘటనా స్థలానికి చేరుకొని కొండ చిలువను పట్టుకున్నారు. ఈ కార్యక్రమలో సొసైటీ సెక్రటరీ మధు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో యువకుడి మృతి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జానపాడు రోడ్డులో గల రైల్వేగేటు సమీపంలో మాచర్ల ప్యాసింజర్ రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 34 సంవత్సరాల వయసు కలిగిన యువకుడి మృతికి గల కారణాలు తెలియలేదని పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

● విద్యుత్ భవన్ ఎదుట జేఏసీ ఉద్యోగుల ధర్నా



నిరసన తెలియజేస్తున్న విద్యుత్ సంఘాల జేఏసీ నాయకులు, ఉద్యోగులు

గుంటూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగ సంఘాలు గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. గుంటూరు సంగడిగుంటలో ఉన్న విద్యుత్ భవన్ ఎదుట జేఏసీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎస్ కృష్ణయ్య మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాల సమస్యల పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో యాజ మాన్యం మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. గత ఐదేళ్ల పాలనలో అన్ని విధాలా ఉద్యోగులు మోసపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, డైరెక్ట్ పేమెంట్‌తో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. జేఏసీ కన్వీనర్ ఎంవీ రాఘవరెడ్డి, కో- చైర్మన్ శేషారెడ్డి, ఓసీ అసోసియేషన్ నేత శ్రీనివాసరావు, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు బాలకాశయ్య, కట్టా నాగరాజు, జిల్లా చై ర్మన్ ఎం.వీరాంజనేయులు, కన్వీనర్ ఎన్ విజయకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, గణపతి, సందీప్ పలువురు ఉద్యోగ సంఘాల నాయకులున్నారు.

ఆర్థిక సంఘం నిధుల విడుదలకు విజ్ఞప్తి



కేంద్ర పంచాయతీరాజ్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

నరసరావుపేట, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు 2025-26కు సబంధించి ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు అయన ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ రామ్ ప్రతాప్‌కు వినతి అందజేశారు. పంచాయతీలు నిధుల లేమితో ఇక్కట్లు పడుతున్నాయని వివరించారు. పారిశుధ్య పనులు చేపట్టలేని దుస్థితి నెలకొందన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు జీత భత్యాలు చెల్లించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేసి వాటిని బలోపేతం చేయాలని జాస్తి విజ్ఞప్తి చేశారు.

సబ్సిడీలు ఇవ్వకుంటే వస్త్ర పరిశ్రమ మూతే

● ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ నేతల డిమాండ్



గుంటూరులోని ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్‌లో సమావేశమైన నేతలు

గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వస్త్ర పరిశ్రమ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోందని ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం సబ్సిడీల బకాయిలు రూ.900 కోట్లు విడుదల చేసి ఆదుకోకపోతే మరికొన్ని నెలల్లోనే మిల్లులన్నీ శాశ్వతంగా మూతబడటం ఖాయమని తెలిపారు. గురువారం ఉదయం గుంటూరులోని ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ కార్యాలయంలో ముఖ్య నేతలు సమావేశమై చర్చించుకుని ఆ వివరాలను మీడియాకు విడుదల చేశారు. అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ పి.కోటిరావు సమస్యలను వివరించారు. 2000-15 మధ్య ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు సబ్సిడీలు విడుదల చేసేవన్నారు. దీంతో 2015 నాటికి రూ.25 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆ తర్వాత పరిశ్రమ అభివృద్ధి, విస్తరణ నిలిచిపోయిందని చెప్పారు. అమెరికాకి ఎగుమతులు క్షీణించడంతో మార్కెట్ షేరు పడిపోయిందన్నారు. 2013లో ఇక్కడి నుంచి 400 లక్షల టన్నుల బేళ్ల ఉత్పత్తి జరిగితే నేడు 295 నుంచి 300 లక్షల టన్నుల బేళ్లకు పడిపోయిందన్నారు. గతంలో యూనిట్ ధర రూ.5 నుంచి రూ.6 మధ్య ఉంటే ఒకేసారి 2020-21లో దానిని రూ.9కి పెంచారన్నారు.. కేజీ నూలు ఉత్పత్తి చేయాలంటే ఐదు యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతుంది. దీంతో ఉత్పత్తి ధర పెరిగిపోతుందన్నారు. గత పదేళ్లలో 10 నుంచి 12 పరిశ్రమలకు ఒక్క రూపాయి సబ్సిడీ కూడా విడుదల కాలేదన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.200 కోట్ల సబ్సిడీ మాత్రమే విడుదల చేసిందన్నారు. తాము ఈ సమస్యలన్నింటిని సీఎం చంద్రబాబుకు నివేదించామని, ఆయన ఒక కమిటీ వేసి అధ్యయనం చేయించారన్నారు. అయితే సబ్సిడీ విడుదలలో జాప్యం జరుగుతోందని తెలిపారు. యూనిట్‌కి రూ.2 ప్రోత్సాహకం రూపంలో ప్రభుత్వమే విడుదల చేయాలన్నారు. అలానే ఎలక్ట్రిసిటీ డ్యూటీని గత వైసీపీ ప్రభుత్వం రూ.0.06 పైసల నుంచి ఒకేసారి రూపాయికి పెంచిందని, ఇంత డ్యూటీ దేశంలో మరెక్కడా లేదన్నారు. అసోసియేషన్ వైస్‌చైర్మన్ సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టెక్స్‌టైల్స్ పాలసీ అనేది రాలేదన్నారు. దీని వలన 2018-23 మధ్య ఏర్పాటు చేసిన పరిశ్రమలు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఎల్ రఘురామిరెడ్డి, పీ చలపతిరావు, కేవీరెడ్డి, జీ పవన్, జీ సాత్విక్, యూఎం కుమార్ పాల్గొని ప్రసంగించారు.

పంట కాల్వలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు, 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డి ముక్కల గ్రామం వద్ద పంట కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం వడ్డిముక్కల నుంచి యడవల్లి వెళ్లే రహదారి పక్కన ఉన్న పంట కాల్వలో వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 50 ఏళ్ల ఉన్న మృతుడి సమాచారం తెలిసిన వారు రూరల్ పోలీసు స్టేషన్లో తెలపాలని పోలీసులు కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

డిపాజిట్ల పెంపునకు శ్రద్ధ చూపాలి : డీసీసీబీ చైర్మన్ మక్కెన

గుంటూరు, సెప్టెం బరు 18(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో డిపాజిట్ల పెంపునకు అధికారులు, ఉద్యోగులు మరింత శ్రద్ధ చూపాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సూ చించారు. గుంటూరు బ్రాడీపేటలో ఉన్న ఎన్టీఆర్ సహకార భవన్‌లో గురువారం జిల్లాలోని బ్యాంకు మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జిల్లాలోని బ్యాంకుల వారీగా వ్యాపార లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. బ్రాంచ్‌లలో అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రుణాల మంజూరులో కూడా పారదర్శకత పాటించడంతో పాటు నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. రికవరీలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీసీసీబీ సీఈవో సీహెచ్ అజయ్‌కిషోర్, జీఎంలు వీవీఎస్ ఫణికుమార్, మాధవి, ఏజీఎంలు, జిల్లా మేనేజర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మక్కెన, సీఈవో అజయ్‌కిషోర్

40,148 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 38,332 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,148 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,265 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12300
334	10500	14400	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13800	334	10500	14600
273	----	----	నెంబరు. 5	10000	13600
341	10000	15300	273	----	----
4884	----	----	341	10000	15800
సూపర్ 10	----	----	4884	10000	13700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14700	తేజ	10000	14800
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	15400
బ్యాడిగి	10000	15500	దేవనూరు డీలక్స్	10000	14000
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7200

ఇన్‌చార్జి ఎంపీడీవోకు డీఎల్‌పీవోగా పదోన్నతి

● మార్కాపురం బదిలీ

కొల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్బారావుకు పదోన్నతి లభించింది. గురువారం కొల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్ చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారావు మార్కాపురం డీఎల్‌పీవోగా పదోన్నతి రావడంతో బదిలీ అయ్యారు. కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మహాలక్ష్మిని ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా మండల పరిధిలోని కిష్కిందపాలెం పంచాయతీ కార్యదర్శి వీఆర్ శేషగిరిరావు చార్జ్ తీసుకున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు.

సముద్రతీర భద్రతపై అవగాహన సదస్సు

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీర ప్రాంత భద్రతపై సామాజిక అవగాహన సదస్సు నిర్వహించారు. బాపట్ల మండలం ముత్తాయిపాలెం గ్రామంలోని రామాలయం దగ్గర సీఐ శ్రీనివాసులు అధ్యక్షతన సూర్యలంక కోస్టల్ సెక్యూరిటి పోలీసు వారు సదస్సును నిర్వహించారు. మత్స్యకారులు, కోస్ట్‌గార్డ్, అటవీశాఖ, గ్రామసెక్రటరి తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ ప్రమాదనివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇండియన్ కోస్టల్ సెక్యూరిటి అధికారి కిరణ్‌కుమార్, సందీప్, ఫారెస్ట్ అధికారి టి.గోపిచంద్, మత్స్యకార సంఘనాయకులు కొక్కిలిగడ్డ స్వాములు, డి.పోతురాజు, వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు రెండురోజుల శిక్షణ

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలు నందు ఈనెల 19, 20వ తేదీల్లో ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు అధ్యక్షతన గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాలాభివృద్ధి అధ్యయనంపై అవగాహన కల్పించేందుకు సర్పంచులు, కార్యదర్శులు హాజరుకావాలని తెలియజేశారు.

దొంగతనం కేసుల్లో జైలుశిక్ష

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల్లో దేవుడి నగలు దొంగిలించిన మూడు కేసుల్లో నిందితులకు జైలుశిక్ష పడినట్లు ఎస్ఐ శివయ్య గురువారం తెలిపారు. భట్టిప్రోలులోని శివాలయంలో గత సంవత్సరం జూలై 12న, గుండి పార్వతీ అమ్మవారి దేవస్థానంలో జూలై 17న, ఆగస్టు 17న చుండూరు మండలం ఆలపాడు వంతెన వద్ద ఉన్న గుడిలో వెండి ఆభరణాలు దొంగిలించిన ముగ్గురు కారంపూడి విజయ్‌కుమార్, తాటిపర్తి సాయి, బండికట్ల పవన్ కల్యాణ్‌లుగా గుర్తించి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. గురువారం రేపల్లె ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మూడు చోట్ల నేరాలకు పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో జడ్జి దేవిసాయిశ్రీవాణి ఏడు నెలలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. చుండూరు సీఐ శ్రీనివాస్, భట్టిప్రోలు ఎస్ఐ శివయ్యలు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా సీనియర్ ఏపీపీ జ్యోతి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్

అమృతలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని వినియోగించుకోవాలని సిడిపివో లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని యలవర్రులో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ ద్వారా మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు మహిళలకు మందులు కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో మారుతీ శేషమాంబ మాట్లాడుతూ, రక్తహీనత, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు కొత్తపల్లి మ్యాథ్యూస్, మత్తయ్య, అశోక్ గ్రామ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రిక

చుండూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో అనారోగ్య సమస్యలు గుర్తించి వైద్యసేవలు పొందినట్లయితే వ్యాధి తీవ్రతలను ముందుగానే నివారించవచ్చునని చినపరిమికి చెందిన పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ చంద్రిక తెలిపారు. స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బాపట్లరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అప్పికట్ల సమీపంలోని యరకాల్వ వద్ద గుర్తుతెలియని మృతదేహం గురువారం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాలోపు ఉంటుందని.. ఒంటిమీద బ్లూషర్ట్ ఉందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పారదర్శకత కోసం స్మార్ట్ న్యూ రేషన్ కార్డులు

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం స్మార్ట్ న్యూ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. బాపట్ల మండలం మూలపాలెంలో గురువారం ఆయన లబ్ధిదారులకు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడైన ఈ కార్డును ఉపయోగించి నిత్యావసర వస్తువులు పొందవచ్చునన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా మధ్యవర్తుల దోపిడిని అరికట్టేవిధంగా కార్డులు ఉపయోగపడుతాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల మండలంలోని అప్పికట్ల, ఈతేరు గ్రామాల్లో తహసీల్దార్ షేక్ సలీమా స్మార్ట్ న్యూరేషన్ కార్డులను పంపిణీ చేశారు. బాపట్ల పట్టణ, మండలంలోని 93 రేషన్ దుకాణాలకు సంబంధించి 40,231 స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మూలపాలెంలో స్మార్ట్ న్యూరేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

అవకతవకలు అరికట్టేందుకే స్మార్ట్ కార్డులు

● జొన్నలగడ్డ విజయబాబు

వేమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ పంపిణీ విధానంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకువచ్చిందని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పేర్కొన్నారు. గురువారం వేమూరులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నే ప్రసాద్, పిల్లి ఫణీంద్ర, డీలర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కార్డుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలి

● తాండ్ర సాంబశివరావు

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం స్మార్ట్ న్యూరేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావటం హర్షణీయమని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. ప్రతికుటుంబానికి కార్డు అందేవిధంగా చూడాలని ఆయన కోరారు.



వేమూరులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

రక్తదానం ప్రాణదానంతో సమానం

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావులు అన్నారు. బాపట్ల ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేస్తున్న విద్యార్థులను అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీ రాఘవరావు, ఏరియా వైద్యశాల బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, ఎన్ఎస్ఎస్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు.

గొర్రెల పెంపకం దారుల సమస్యలు పరిష్కరించాలి



లీడ్‌బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రావు తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కార్యదర్శి వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు శేషు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పెంపకందారులంతా ఐక్యంగా ఉండి సమస్యల సాధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. బాపట్లలీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీకృష్ణ, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ వేణుగోపాలరావులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పి.కొండయ్య, వీరాస్వామి, వెంకటేశ్వర్లు, దబ్బకూటి యలమంద, మసనం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శిశువుల ఆహారపు అలవాట్లకు ప్రాముఖ్యత ఇవ్వాలి



రేపల్లెలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శిశువుల ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సీడీపీవో మారుపూడి సుచిత్ర పేర్కొన్నారు. గురువారం స్థానిక శివాజీ స్కూల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం నందు 8వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అధిక నూనె వినియోగం ఆరోగ్యానికి హానికరమన్నారు. లబ్దిదారులు తమంతట తాము పోషణ ట్రాకర్ యాప్ ద్వారా నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాల లబ్ధిపొందే విధానం గురించిన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హిమబిందు, స్కూల్ టీచర్ షమాడ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో పోషణ మాసోత్సవాలు

కర్లపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం సెక్టార్ పరిధిలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోషక విలువలపై గురువారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శేషకుమారి మాట్లాడుతూ ఫాస్ట్‌ఫుడ్ వల్ల కలిగే నష్టాలను, సమతుల ఆహారం తీసుకోవటం వలన కలిగే లాభాలను వివరించారు. విద్యార్థులతో కలిసి పోషక విలువలపై గణపవరంలో అగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార బ్యానర్‌లను ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ శేషకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు

పరిసరాల శుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల మార్కెట్ వద్ద చీపిరి పట్టి ఊడుస్తున్న కమిషనర్

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే ప్రతిఒక్కరికి మెరుగైన ఆరోగ్యం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం కమిషనర్ ఆధ్వర్యంలో 19వవార్డు రైతుబజారు, మార్కెట్ ఏరియా ఆవరణంలో ప్రధానవీధులను శుభ్రం చేశారు. శానిటరి ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ, మున్సిపల్, మెప్మా సిబ్బందితో కలిసి రోడ్లు ఊడ్చి మార్కెట్ పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగించారు. ప్రజలు నివాసాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రత ప్రజల బాధ్యత అని ఆయన తెలిపారు. అదేవిధంగా డోర్ టూ డోర్ సర్వే నిర్వహించి ఆస్తి పన్నులోకి రానటువంటి భవనాల కొలతలను, ఉపయోగించు విధానాలను పరిశీలించారు. 1వవార్డు బేతనీకాలనీ రామకృష్ణాపురం ప్రాంతాల్లో ఆర్‌వో అబ్దుల్ జబ్బార్, సిబ్బందితో కలిసి పరిశీలించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : చందోలు ఎస్ఐ



డ్రగ్స్‌పై యువతకు అవగాహన కల్పిస్తున్న చందోలు ఎస్ఐ వెంకటశివకుమార్, పోలీసు సిబ్బంది

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు డ్రగ్స్ బారీన పడకుండా జాగ్రత్తలు వహించే బాధ్యత తల్లిదండ్రులదేనని చందోలు ఎస్సై ఎం.వెంకటశివకుమార్ అన్నారు. మండలంలోని చందోలు గ్రామపంచాయతీ శివారు రెడ్డిపాలెం కూడలి నందు గ్రామస్తులతో డ్రగ్స్ ఎవరు వినియోగించకూడదని డ్రగ్స్‌ను విక్రయించినట్లైతే స్థానిక పోలీసులకు సమాచారం తెలియజేయాలని, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగియుండాలని, దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి వెంట ధ్రువీకరణ పత్రాలు కలిగియుండాలని, హెల్మెట్ ధరించాలని తెలియజేశారు. బాపట్ల ఈగల్ సెల్ నోడ్రగ్స్ నోటెన్షన్ ఇదే యువత సక్సెస్ మంత్రమని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో చందోలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

● డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ హుస్సేన్

కర్లపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులందరు ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాల్లో లభ్యమయ్యే సేంద్రియ ఉత్పత్తులైన ఘన, ద్రవ జీవామృతాలను ఉపయోగించాలని రసాయనిక ఎరువులను పూర్తిగా తగ్గించాలని డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ సయ్యద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని దుండివారిపాలెంలో గురువారం ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ఏవో ఎం.సుమంత్‌కుమార్ అధ్యక్షత వహించారు. వారు ఈ సందర్భంగా రైతులు విషరహిత ఆహారాన్ని పండించాలని వనరుల కేంద్రంలో అభ్యమయ్యే కషాయాలను పొలాలకు ఉపయోగించాలని కోరారు. అడిషనల్ డీపీఎం మోహన్ మాట్లాడుతూ నవధాన్యాల సాగు వల్ల భూమిని 365 రోజులు కప్పి ఉంచటం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెంచుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఈవో ఎండీ గౌస్‌బాష, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎన్ఎఫ్ఏలు ఎం.వరధానమ్మ, టి.లక్ష్మీప్రసన్న, ఎంటి శ్రీకాంత్, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

మూడో విడత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మూడో విడత కుట్టు శిక్షణ కేంద్రాన్ని జడ్పీటీసీ టి.ఉదయభాస్కరి ప్రారంభించారు. గురువారం అద్దేపల్లిలో భట్టిప్రోలు ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మూడో విడత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేయాలని సూచించారు. బొలిశెట్టి జయబాబు మహిళల ఆర్థిక ఉన్నతి కోసం కుట్టుశిక్షణ కేంద్రాలను నిర్వహించి కుట్టుమిషన్లు కూడా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు, వంగర బాబూజీ, పసుపులేటి శివరామప్రసాద్, తిరువీధుల బాలాజీ, శిక్షకురాలు నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

చిన్నారులకు ఫ్రెండ్లీ టాయిలెట్, ర్యాంప్

కర్లపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఫ్రెండ్లీ టాయిలెట్, ర్యాంప్ శాంక్షన్ అయినందున గురువారం సమగ్రశిక్షణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగజ్యోతి, సహితా విద్య సమన్వయకర్త మట్ట జోష్నా ఎంపీపీఎస్ ఇందిరానగర్‌లోని ఉన్న భవితా సెంటర్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ఈ చిన్నారులకు ఫ్రెండ్లీ టాయిలెట్, ర్యాంప్ కట్టించబడుతుందని స్థలం ఎక్కడ కడితే బాగుంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.శైలజని, భవితసెంటర్ ఉపాధ్యాయురాలు నరాలశెట్టి లక్ష్మీప్రసన్న, చెన్నుబోయిన చందనాను అడిగి తెలుసుకున్నారు.


విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్



సబ్‌స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చెరుకుపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా చెరుకుపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను జడ్పీహెచ్ఎస్ గుళ్లపల్లి విద్యార్థులు గురువారం సందర్శించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ, ప్రక్రియలను సమగ్రంగా అర్థమయ్యేలా విద్యార్థులకు వివరించారు. సబ్‌స్టేషన్‌లో సాంకేతిక నిపుణులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనితీరు, సేఫ్టీ ప్రమాణాలు, ఆధునిక విద్యుత్ వ్యవస్థల్లో వినియోగిస్తున్న పరికరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీ ఎస్.సురేష్‌బాబు, ఉపాధ్యాయిని కోనేటి కవిత, మురళీకృష్ణ, రామారావు, ధ్యాన్‌చంద్ర, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన



ఇండస్ట్రియల్ పార్కులో స్కూల్ విద్యార్థులు

చుండూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో పాఠశాల స్థాయిలోనే వివిధ స్థానిక పరిశ్రమలపై అవగాహన కల్పించడానికి యడ్లపల్లి విద్యార్థులు గురువారం తెనాలి ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కులోని కుమార్ పంప్స్ సందర్శించారు. ఎల్ఎన్‌సి మిషన్ వర్కింగ్, కంప్రెషన్ మిషన్ వర్కింగ్, డ్రిల్లింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ విజిట్‌కు కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, వివేక విద్యాసంస్థల అధినేత రావిపాటి వీరనారాయణ, హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు చేయూత అందించారు.

22 నుంచి శ్రీమద్దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు

కొల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీమద్దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పార్వతీ అమ్మవారి దేవస్థానం బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జనస్వామి కృష్ణమూర్తి గురువారం తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం గ్రామోత్సవం, ఆలయ ప్రాంగణంలో పౌరాణిక, ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. భక్తులు నవరాత్రుల్లో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు



బహుమతులు సాధించిన విద్యార్థులతో డీఈవో ఎస్.పురుషోత్తం

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో వారధి ఇండియా ఫౌండేషన్ వ్యాసరచన, డిబేటింగ్ పోటీలను నిర్వహించారు. స్థానిక సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వ్యాసరచన పోటీల్లో ఈపురుపాలెం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినుల జట్టు ప్రథమ స్థానం సాధించింది. జె.పంగులూరు మండలం ఎస్ఆర్‌జేఆర్‌వై జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. డిబేటింగ్‌లో నగరం మండలం ఉల్లిపాలెం హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం, వేటపాలెం మండలం పందిళ్లపల్లి హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని, ఇంకొల్లు మండలం స్వర్ణ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలను డీఈవో ఎస్.పురుషోత్తం అభినందించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహ్మద్‌సాధిక్, అకడమిక్ మానిటరింగ్ అధికారి బిళ్ళా మోజెస్, గైడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో చేనేత పరిశ్రమ

● సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు



చేనేత అధ్యయన యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న సంఘ నాయకులు పార్థసారధి, బాలాజీ తదితరులు

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతోనే చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం భట్టిప్రోలుకు చేరిన చేనేత సంఘ అధ్యయన యాత్రలో సంఘ నాయకులు, కార్మికులు పాల్గొని యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సహకార సంఘాలకు పది సంవత్సరాలుగా పాలకవర్గ ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేయడంతో కార్మికులు ఉపాధి దెబ్బతిని నేతన్నలు అర్ధాకలితో బతుకులు సాగిస్తూ ఆకలి మరణాలు, ఆత్మహత్యలకు బలవుతున్నారని దీనికి కారణం పాలక ప్రభుత్వాలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార సంఘాలకు ప్రభుత్వం బకాయిలు చెల్లించే వరకు తమ పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. యాత్రలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ, కోశాధికారి బత్తూరి మోహనరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు గజపల్లి వెంకటకృష్ణారావు, కొడాలి రామకోటేశ్వరరావు, వెంకటలక్ష్మి, కౌతరపు పార్థసారధి, కె.వీరమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె చేరుకున్న చేనేత సంఘ అధ్యయన యాత్ర

రేపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమస్యల వలయంలో చేనేత పరిశ్రమ కొట్టుమిట్టాడుతుందని కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు గురువారం పేర్కొన్నారు. రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చేనేత సంఘ అధ్యయన యాత్ర రేపల్లె చేరింది. ఈ యాత్రలో సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగాంజనేయులు, చేనేత కార్మిక సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తూరి మోహనరావు, కొడాలి రామకోటేశ్వరరావు, పార్థసారధి, వీరమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీ ఏకగ్రీవం

బాపట్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బాపట్లశాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రంథాలయశాఖాధికారి ఏ శివాజిగణేశన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈవో డి.ప్రసాదరావు, ఏబీఈ స్కూల్ ప్రధానోపాధ్యాయిని వై.సత్యవతిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. గ్రంథాలయాల ప్రాధాన్యాన్ని తెలియజేసి వాటి అభివృద్ధికి నూతన కమిటీ పాటుపడాలని కోరారు. అనంతరం అధ్యక్షుడిగా చాపల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా వీసీ సాయిబాబు, కార్యదర్శిగా శేషాద్రినాయుడు, జాయింట్ సెక్రటరీగా బూర్లె రామసుబ్బారావు, కోశాధికారిగా ఎ.శివాజిగణేశన్, అడ్వయిజర్‌గా కళ్ళం హరినాధరెడ్డి, సభ్యులుగా వై.సత్యవతి, జి.వెంకటేశ్వరరావు, బొమ్మిశెట్టి శివరామకృష్ణ, సీహెచ్.ఉపేంద్ర, గంటా శంకరరావు, శీలం శ్రీనివాసరావు, కె.నాగరాజు, శామ్యూల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన భవన నిర్మాణం ఏర్పాటుకు కృషి చేయాలని తీర్మానించారు.

అఖిలపక్ష నాయకుల పరిశీలన



మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రజాసంఘాల అఖిలపక్షనాయకులు

బాపట్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ సింగయ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు గురువారం పరిశీలించారు. ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేయటం వల్ల బలహీనవర్గాల ప్రజలు వైద్యవిద్యకు దూరమౌతారని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజారావు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులు డాక్టర్ కావాలన్న కల కలగానే మిగిలిపోతుందన్నారు. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన రిజర్వేషన్‌లు కోల్పోతారన్నారు. ప్రభుత్వం ఈ విధానాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీమ్‌ఆర్మీ జిల్లా అధ్యక్షుడు కొచ్చెర వినయ్‌రాజు, కులనిర్మూలన పోరాటసమితి కార్యదర్శి కె.శరత్, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కొండయ్య, బీఎస్‌పీ నాయకులు ఏహూరి జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ నాగరాజుకు అంతర్జాతీయ అవార్డు



అవార్డు పొందిన ఛాయాచిత్రం

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఫొటోగ్రాఫర్ డాక్టర్ పీవీఎస్ నాగరాజుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. కలకత్తా కేపీటీవీ ఫొటోగ్రఫీ వరల్డ్‌వారు ఆన్‌లైన్‌లో గత నెల నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పవన్‌క్లాసిక్ ఫొటోగ్రఫీ అధినేత పీవీఎస్.నాగరాజు తీసిన వర్షంలో తాబేలుతో ఆడుతున్న బాలిక ఛాయాచిత్రానికి ఓపెన్ కేటగిరిలో మొదటి స్థానం దక్కింది. దీంతో సంస్థ వ్యవస్థాపకురాలు సుజాతమండల్ ఆన్‌లైన్‌లో అభినందనలు తెలియజేసి అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ నాగరాజును పలువురు అభినందించారు. అవార్డు అందుకున్న నాగరాజును బాపట్ల ఫొటోగ్రాఫర్స్, పట్టణ ప్రముఖులు అభినందించారు.

సుందర మనోహరం సూర్యలంక తీరం

● ఆంధ్ర గోవా.. ప్రకృతి సోయగాలెన్నో.. ● పర్యాటక శాఖ సౌకర్యాలతో..మరింత ఆహ్లాదం
● భక్తుల పుణ్య ప్రదేశం..పర్యాటకులకు వినోద భరితం ● బీచ్ ఫెస్టివల్‌తో దేశవ్యాప్తంగా మరింత ఖ్యాతి



ఆహ్లాదకరమైన సూర్యలంక సముద్రతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు



బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అత్యంత సుందరమైన, ఆహ్లాదకరమైన సూర్యలంక సముద్ర తీరం విశేష ఖ్యాతినార్జించింది. భక్తజనకోటి మదిలో పదిలంగా జలాశీస్సులు అందిస్తూ.. ఎంతో ప్రాముఖ్యత, మరెంతో ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకుల్ని కనువిందు చేస్తున్న సూర్యలంక సుందర మనోహర వేదికగా విరాజిల్లుతోంది. ఆంధ్ర గోవాగా ఖ్యాతిగాంచిన సూర్యలంక తీరం తూర్పు దిక్కు నుంచి దక్షిణ దిశగా అర్ధ చంద్రాకృతిలో ఉండటం విశేషంగా పేర్కొంటారు. దీనివల్ల తుఫాన్‌లు, వరదలు సంభవించినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెబుతుంటారు. అలాగే భావదేవుని ఆశీస్సులు మెండుగా ఉంటాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. సముద్ర తీరం చదునుగా ఉండటంతో పుణ్య స్నానాలు చేసే భక్తులకు, వృద్ధులకు, పిల్లలకు ఈ తీరం ఎంతో అనువుగా ఉంటుంది. తెల్లవారుజామున సూర్యోదయం అత్యంత రమణీయంగా, శోభాయమానంగా కనిపిస్తుంది. దీనిని తిలకించేందుకు తెల్లవారు జామున భక్తులు, పర్యాటకులు ఇక్కడకు విచ్చేస్తుంటారు. పుడమి తల్లిని పులకరింప చేసే ఉదయ భానుడు లేలేత కిరణాలు తొలి చలనం ద్వారా ఆవిష్కృతమై వీక్షకులకి కనువిందు చేస్తాయి. రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచే కాకుండా కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, నల్గొండ, ఉభయగోదావరి జిల్లాలు.. హైదరాబాద్ తదితర ప్రాంతాలు నుంచి లక్షలాది మంది పర్యాటకులు, భక్తులు విచ్చేస్తుంటారు. కార్తిక స్నానాల స్వర్గదామంగా విరాజిల్లుతున్న బాపట్ల సముద్ర తీరానికి విదేశీ పర్యాటకులు అనేక మంది విచ్చేస్తుంటారు. ఇక్కడకి వచ్చిన ఎందరికో ఈతీరం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



హరిత సోయగం

పచ్చదనాన్ని వెదజల్లుతూ తీరం దారిపొడవునా ఇరువైపులా విస్తరించిన అడవి ఇక్కడి మరో ప్రత్యేకత. లక్షలాదిగా విచ్చేసే యాత్రికులకు, భక్తులకు ప్రకృతి ప్రసాదించిన మడ చెట్లు.. చల్లని వాతావరణంతో కార్తీక మాసంలో బృందా వనంలా ఉంటాయి. అటవీ శాఖ సంరక్షణలోని జీడి, సరివి, జామాయిల్ తోటలు విస్తారంగా ఉండటంతో వనభోజనాధి కార్యక్రమాలకు సౌకర్యంగా ఉన్నాయి.

● కనువిందు చేసే పొగురు

సూర్యలంక సముద్ర తీరాన్ని సందర్శించే పర్యాటకులకు ఇక్కడ పొగురు ప్రాంతం ఆకట్టుకుంటుంది. తీరం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ పొగురు ఉంది. కాల్వలు అన్ని సముద్రంలో కలిసే ఈ సన్నివేశం చూడ ముచ్చటగా ఉంటుంది. నల్లమడ వాగు, పేరలి కాల్వలు సముద్రంలో కలిసే ప్రాంతాన్ని పర్యాటకులు ప్రత్యేకంగా సందర్శించి తిలకిస్తుంటారు. సూర్యలంక అందాల వెనుక ఇదో అద్భుతం.

● ఆంజనేయస్వామి ఆశీస్సులు

సముద్రతీరానికి విచ్చేసే యాత్రీకులకు తీరంలో వేంచేసియున్న భజనాంజనేయస్వామి వారి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారంలా ప్రసిద్ధి పొందింది. పుణ్య దినాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. తీరానికి తూర్పు ముఖంగా ప్రతిష్ఠించిన ఈ ఆలయంలో నిత్యం భక్తులు పూజలు చేస్తుంటారు. స్వామి వారి అనుగ్రహం భక్తులపై సదా ఉంటుందని విశ్వసిస్తుంటారు.

● రవాణా, వసతి సౌకర్యం

సూర్యలంక తీరానికి విచ్చేసే యాత్రీకులకు రవాణా సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. బాపట్ల పట్టణం నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యలంకను సందర్శించేందుకు ఆర్టీసీ సర్వీస్‌లు, ఇతర వాహనాలు ఉన్నాయి. బాపట్ల రైల్వేస్టేషన్ నుంచి ఇక్కడకు నేరుగా విచ్చేసేందుకు ఆటో సర్వీస్‌లు ఉన్నాయి. పర్యాటకులు సేద తీరేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏసీ కాటేజీలు అందుబాటులో ఉన్నాయి. హరితా బీచ్ రిసార్ట్స్ పేరుతో ఈ సదుపాయాలను పర్యాటక శాఖ అమలు చేస్తోంది. ఇవి కాకుండా అనేక ప్రైవేట్ అతిథి గృహాలు, లాడ్జిలు అందుబాటులో ఉన్నాయి.



సూర్యలంక సముద్రతీరంలో విహరిస్తున్న గూడపక్షులు

బీచ్ ఫెస్టివల్‌కు.. విదేశీ అతిథులు..!

ప్రకృతి ప్రేమికులకు కను విందు

బాపట్ల, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): బాపట్ల సూర్యలంక తీరంలో విదేశీ అతిథులు సందడి చేస్తున్నాయి. పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించ తలపెట్టిన బీచ్ ఫెస్టివల్ ఆహ్వానంతో.. తామంతా విచ్చేశామన్న సందేశం పర్యాటకులకు ఇస్తున్నాయి. పీతలు తీరంలో ముగ్గులేస్తూ.. స్వాగతం పలుకుతున్నాయి. గూడ పక్షులు విహంగాలతో ఆకాశానికి తోరణాలు కడుతున్నాయి. బంగారు ఉల్లంకి, తురగ పిగిలి, కొల్లేటి కొంగ, సోవాత గువ్వ, జాలె డేగ చేరి.. పండగను మొదలు పెట్టేశాయి.

విదేశీ అతిథులు..

దేశ, విదేశాలు నుంచి ఏటా సూర్యలంక సముద్ర తీరానికి అనేక జాతుల పక్షులు వస్తుంటాయి. 115 రకాల పక్షులు ఈ ప్రాంతానికి వస్తుంటాయని అధికారులు చెబుతున్నారు. మూడు నెలలు ఇక్కడే ఉండి.. సంతానోత్పత్తి చేసుకొని.. తిరిగి వెళ్తుంటాయి. ఆహారం కోసం వచ్చే ఈ పక్షులు మడ అడువులు, పొగురు వద్ద నివాసం ఉంటాయి. ముఖ్యంగా టిబెట్, పశ్చిమాసియా, ఐరోపా, సైబీరియా, మంగోలియా, చైనా వంటి దేశాలు నుంచి వలస వస్తుంటాయి. బీచ్ ఫెస్టివల్ నేపథ్యంలో గూడ పక్షలు గుంపులుగా వచ్చి పొగురు వద్ద కనువిందు చేస్తున్నాయి.

తీరంలో నేస్తాలు..

తాబేళ్లు ఒడ్డుకు వచ్చి గుడ్లు పెడుతున్నాయి. పీతలు ఇసుకలో ముగ్గులు వేస్తున్నాయి. బంగారు ఉల్లంకి, తురగ పిగిలి, కొల్లేటి కొంగ, సోవాత గువ్వ, జాలె డేగ చేరి.. ప్రకృతి ప్రేమికులను రారామ్మని పిలుస్తున్నాయి. ఇక మేమొచ్చాం.. పర్యాటకులదే ఆలస్యమంటూ పండగను మొదలు పెట్టాయి.



జాలెడేగ



సోవాత గువ్వ



సముద్రం నుంచి ఒడ్డుకు వస్తున్న తాబేళ్లు

ఎన్టీఆర్ విగ్రహానికి ఘన నివాళి



వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీలు అనురాధ, ఆలపాటి, ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, శ్రావణ్‌కుమార్, చినరాజప్ప, రామాంజనేయులు, బోడే ప్రసాద్

తుళ్లూరు, (వెంకటపాలెం) సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమవేశాలకు వెళ్లే ముందు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివారావు గురువారం ఉదయం పూలదండలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయనతో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, నిమ్మకాయల చినరాజప్ప, బూర్ల రామాంజనేయులు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, ఆలపాటి రాజా ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఆనవాయితీ ప్రకారం శాసన సభా సమావేశాలకు వెళ్లే టప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించి వెళతారు. అయితే అనుకోకుండా ఈ కార్యక్రమం రద్దయ్యింది. దీంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలే నివాళి అర్పించి అసెంబ్లీకి వెళ్లారు. జగన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరుపై మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు తీవ్రంగా విమర్శించారు. 11 ఎమ్మెల్యేలుంటే ప్రతి పక్ష హోదా కావాలని జగన్‌రెడ్డి అడగటం హాస్యాస్పదమన్నారు. పదిశాతం బలం ఉంటేనే ప్రతిపక్ష హోదా ఉంటుందనే జ్ఞానం కూడా లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడం పిరికిపందల చర్య అని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రజా గళం వినిపించలేని వాళ్లు ఎమ్మెల్యేలుగా ఎలా ఉంటారని ప్రశ్నించారు.

ఏపీ రెరా సభ్యుడిగా డీఎస్ఆర్ ప్రమాణ స్వీకారం



దామచర్ల శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) సభ్యుడిగా టీడీపీ నేత దామచర్ల శ్రీనివాసరావు ప్రమాణస్వీకార కార్యక్రమం విజయవాడలోని కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఆయన ట్యాక్స్ కన్సల్టెంట్‌గా, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్, ప్రాక్టీషనర్స్ కన్సల్టెంట్ సంఘం అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్టీఆర్ స్టేడియం కార్యదర్శిగా వ్యవహరించిన దామచర్ల స్టేడియం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశారు. డీఎస్ఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శిగా పనిచేసి అనేక సేవా కార్యక్రమాలు చేశారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి పనిచేసిన డీఎస్ఆర్ రెరా సభ్యుడిగా నియమితులవడం శుభ పరిణామమన్నారు. దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో పాటు ఇతర ముఖ్య నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, దారపనేని నరేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నాయు డు ఓంకార్, మేళం సైదయ్య, డీఎస్ఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కొత్తపల్లి నాగేశ్వరరావు, ముప్పా వేణుబాబు, గుర్రం ప్రసాద్, బిల్డర్స్ నాయకులు, రాష్ట్ర ఆడిటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీ కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ నరేష్, వీవీ సుబ్రమణ్యం, సాదినేని శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఎన్ భారతీప్రసాద్ డీఎస్ఆర్‌కు అభినందనలు తెలియజేశారు.



ఏపీ రెరా చైర్మన్ శివారెడ్డికి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేస్తున్న దామచర్ల శ్రీనివాసరావు

తీరిక సమయంలో..



ఇంట్లో పనులు పూర్తయ్యాక ఖాళీ సమయంలో కుట్టు శిక్షణకు హాజరవుతున్నా. కుట్టులో మెళకువలు నేర్చుకోవడం ఎంతో ఉపయోగపడింది.

-గోపిశెట్టి లలితకుమారి

స్వశక్తితో బతికేందుకు :



కుట్టు శిక్షణ స్వశక్తితో నిలబడేందుకు ఎంతో ఉపయోగపడింది. ఇంటి పనులకే పరిమితం కాకుండా.. కుట్టులో శిక్షణ తీసుకున్నాను.

-సీహెచ్ త్రివేణి

కుటుంబానికి ఆధారం :



భర్త చనిపోయి ఒంటరి మహిళగా.. కూలీ పనికి వెళ్లాల్సి వస్తోంది. కుట్టు శిక్షణ.. ఇంటిలో ఉండే ఎంతో కొంత సంపాదించి కుటుంబానికి ఆధారంగా నిలిచేందుకు ఉపయోగపడుతుంది.

-చిమటా నాగేంద్రం

కుట్టు శిక్షణ.. కుటుంబ పోషణ

● 100 రోజులు శిక్షణ పూర్తి ● స్వశక్తితో జీవించేందుకు ఉపాధి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటికే పరిమిత మైన మహిళలకు కుట్టు శిక్షణ ఆర్థిక వెసులు బాటును కల్పిస్తోంది. కుటుంబ పోషణకు చేయూతనిస్తోంది. గృహిణులు, ఒంటరి మహిళలు, యువతులు తీరిక చేసుకుని గురజాలలోని కుట్టు శిక్షణ కేంద్రానికి క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. కుట్టులో మెళకు వలు నేర్చుకుంటూ.. స్వశక్తిపై జీవించేందుకు భరోసా పొందుతున్నారు. పిడుగురాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం గత మే 21న ప్రారంభమైంది. పల్నాడులో యువతకు బతుకు దెరువు, చేతివృత్తి ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే ఆలోచనతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బీసీ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. పిడుగురాళ్లకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేయించారు. ఈ కుట్టు శిక్షణ కేంద్రంలో మొదటి బ్యాచ్ నేటికి 100 రోజులు పూర్తి చేసుకుంది. 90 మంది వరకు పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన యువత, మహిళలు హాజరయ్యారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతిరోజు రెండు విడతలుగా మహిళలకు వివిధ రకాల డిజైన్‌లు, కుట్టు శిక్షణ అందించారు. దూ దేకుల ఖాశింబి, షేక్ హమీషాలు పలు మెళకువలు నేర్పిస్తున్నారు. మూడేళ్ల పాటు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు శిక్షణ కేంద్రం పిడుగురాళ్లలోనే కొనసాగుతోంది. 100 రోజుల శిక్షణలో 75 రోజులు తక్కువ కాకుండా హాజరైన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్‌ను ఉచితంగా అందజేయడం జరుగుతుంది.



మహిళలు కుట్టిన దుస్తులు



కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు

వినియోగదారుల సంతృప్తి శాతాన్ని పెంచాలి

● విద్యుత్‌శాఖ సీఎండీ పుల్లారెడ్డి

గుంటూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదా రుల సంతృప్తి శాతాన్ని మరింత పెంచేందుకు అధికారులు పనిలో మరింత శ్రద్ధ చూపాలని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ పి.పుల్లారెడ్డి ఆదేశించారు. గుంటూరు సంగడిగుంటలోనున్న విద్యుత్ భవన్‌లో గురువారం సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్ నేతృత్వంలో గుంటూరు సర్కిల్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ నిరంతరాయ విద్యుత్ సరఫరాపై ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. లో వోల్టేజ్ సమస్యలు రాకుండా అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్ ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ సర్వీసుల కనెక్షన్‌లలో జాప్యం చేయవద్దని, నిబంధనల మేరకు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఇక బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం చేయవద్దని, వందశాతం పూర్తి చేయా లని సూచించారు. ఇక గృహ విద్యుత్ వినియోగ దారులకు నచ్చజెప్పి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వారిలో అపోహలుంటే నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, ఈఈలు తిరుమలశెట్టి శ్రీనివాస బాబు (గుంటూరు-1), వీవీ చిరంజీవి (తెనాలి), పలువురు ఏడీఈలు, ఏఈలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి, వేదికపై డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్, ఎస్ఈ రమేష్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దైవ దర్శనానికి శ్రీశైలం వెళ్తూ చట్టుతాండా వద్ద మోటారు సైకిలు వేగం అదుపు తప్పి కింద పడి నందికొట్కూరుకు చెందిన కే రాకేష్ బుధవారం గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలు వైద్యశాలలో చికిత్సలు పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

నేటి నుంచి డయల్ యువర్ డీఎం

పొదిలి, సెప్టంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్‌రావుగురువారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సమస్యలను తెలియజేవచ్చని సూచించారు.

21న సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఆదివార మధ్యాహ్నం 3గంటలకు సీనియర్స్ స్త్రీ, పురుషుల జట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షులు యనమల సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27, 28 తేదీలలో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు సెల్ : 9381657774 ద్వారా సంప్రదించాలన్నారు.

మోటార్‌సైకిల్‌పై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

- ఇద్దరికి స్వల్ప గాయాలు

కొండపి,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో తారురోడ్డుపై పడి గాయాల పాలైన ఘటన గురువారం మధ్యాహ్నం టంగుటూరు రోడ్డులోని రెస్టారెంట్ సమీపంలో జరిగింది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం మర్రిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన ముగ్గురు ఇద్దరు యువకులు మధ్యలో ఓ యువతిని కూర్చోబెట్టుకుని వేగంగా కొండపి నుంచి టంగుటూరు వైపు వెళ్తున్నారు. ఇంతలో సమీప దూరంలో రోడ్డు పక్క నుంచి ఓ మోటార్ సైకిల్ వచ్చింది. దీంతో వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్ నడిపే వ్యక్తి సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తికి కాళ్లు, చేతులుపై చర్మం కోసుకుపోవడంతోపాటు తలకు తీవ్రమైన గాయం అయింది. మోటార్‌సైకిల్‌పై ఉన్న యువతికి, వెనుక ఉన్న యువకుడికి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. దీంతో గాయపడిన వ్యక్తికి వెనుక వున్న యువకుడు తన చొక్కా విప్పి తల గాయం నుంచి రక్తం కారకుండా అడ్డ పెట్టాడు. ఘటనను చూసిన కొందరు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించగా, వారు బాధితులు ముగ్గురిని కొండపి సీహెచ్‌సీకి తరలించారు.

ఎస్పీని కలిసిన మాగుంట



జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును సత్కరిస్తున్న ఎంపీమాగుంట

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్పీని శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన

బల్లికురవ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారం తీసుకోవడం వలన కలుగు లాభాల గురించి తల్లులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబీ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో పోషణ మాసోత్సవాలలో భాగంగా గ్రామ సంఘాల అధ్యక్షులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు చక్కెర, నూనె అధికంగా వాడితే పలు రకాల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వాటి వాడకాన్ని వీలైనంత మేర తగ్గించాలన్నారు. బలవర్ధకమైన అహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంది స్తున్న పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం రాజారావు, భాస్కర్, సీసీలు పేరయ్య, ప్రమీలా, డేవిడ్ అంగన్ వాడీ కార్యకర్తలు శ్రీదేవి, రాజకుమారి తదితరులు ఉన్నారు.





ఆహ్లాదకరమైన సూర్యలంక సముద్రతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు



సుందర మనోహరం.. సూర్యలంక తీరం

- ఆంధ్ర గోవా.. ప్రకృతి సోయగాలెన్నో..
- పర్యాటక శాఖ సౌకర్యాలతో..మరింత ఆహ్లాదం
- భక్తుల పుణ్య ప్రదేశం..పర్యాటకులకు వినోద భరితం
- బీచ్ ఫెస్టివల్‌తో దేశవ్యాప్తంగా మరింత ఖ్యాతి

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అత్యంత సుందరమైన, ఆహ్లాదకరమైన సూర్యలంక సముద్ర తీరం విశేష ఖ్యాతినార్జించింది. భక్తజనకోటి మదిలో పదిలంగా జలాశీస్సులు అందిస్తూ.. ఎంతో ప్రాముఖ్యత, మరెంతో ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకుల్ని కనువిందు చేస్తున్న సూర్యలంక సుందర మనోహర వేదికగా విరాజిల్లుతోంది. ఆంధ్ర గోవాగా ఖ్యాతిగాంచిన సూర్యలంక తీరం తూర్పు దిక్కు నుంచి దక్షిణ దిశగా అర్ధ చంద్రాకృతిలో ఉండటం విశేషంగా పేర్కొంటారు. దీనివల్ల తుఫాన్‌లు, వరదలు సంభవించినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెబుతుంటారు. అలాగే భావదేవుని ఆశీస్సులు మెండుగా ఉంటాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. సముద్ర తీరం చదునుగా ఉండటంతో పుణ్య స్నానాలు చేసే భక్తులకు, వృద్ధులకు, పిల్లలకు ఈ తీరం ఎంతో అనువుగా ఉంటుంది. తెల్లవారు జామున సూర్యోదయం అత్యంత రమణీయంగా, శోభాయమానంగా కనిపిస్తుంది. దీనిని తనివితీర తిలకించేందుకు తెల్లవారు జామున భక్తులు, పర్యాటకులు ఇక్కడకు విచ్చేస్తుంటారు. పుడమి తల్లిని పులకరింప చేసే ఉదయ భానుడు లేలేత కిరణాలు తొలి చలనం ద్వారా ఆవిష్కృతమై వీక్షకులకి కనువిందు చేస్తాయి. రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచే కాకుండా కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, నల్గొండ, ఉభయగోదావరి జిల్లాలు.. హైదరాబాద్ తదితర ప్రాంతాలు నుంచి లక్షలాది మంది పర్యాటకులు, భక్తులు విచ్చేస్తుంటారు. కార్తిక స్నానాల స్వర్గదామంగా విరాజిల్లుతున్న బాపట్ల సముద్ర తీరానికి విదేశీ పర్యాటకులు అనేక మంది విచ్చేస్తుంటారు. ప్రపంచ నలమూలల నుంచి ఇక్కడకి వచ్చిన ఎందరికో ఈతీరం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

హరిత సోయగం

పచ్చదనాన్ని వెదజల్లుతూ తీరం దారిపొడవునా ఇరువైపులా విస్తరించిన అడవి ఇక్కడి మరో ప్రత్యేకత. లక్షలాదిగా విచ్చేసే యాత్రికులకు, భక్తులకు ప్రకృతి ప్రసాదించిన మడ చెట్లు.. చల్లని వాతావరణంతో కార్తిక మాసంలో బృందా వనంలా ఉంటాయి. అటవీ శాఖ సంరక్షణలోని జీడి, సరివి, జామాయిల్ తోటలు విస్తారంగా ఉండటంతో వనభోజనాధి కార్యక్రమాలకు సౌకర్యంగా ఉన్నాయి.

కనువిందు చేసే పొగురు

సూర్యలంక సముద్ర తీరాన్ని సందర్శించే పర్యాటకులకు ఇక్కడ పొగురు ప్రాంతం ఆకట్టుకుంటుంది. తీరం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ పొగురు ఉంది. కాల్వలు అన్ని సముద్రంలో కలిసే ఈ సన్నివేశం చూడ ముచ్చటగా ఉంటుంది. నల్లమడ వాగు, పేరలి కాల్వలు సముద్రంలో కలిసే ప్రాంతాన్ని పర్యాటకులు ప్రత్యేకంగా సందర్శించి తిలకిస్తుంటారు. సూర్యలంక అందాల వెనుక ఇదో అద్భుతం.

ఆంజనేయస్వామి ఆశీస్సులు

సముద్రతీరానికి విచ్చేసే యాత్రీకులకు తీరంలో వేంచేసియున్న భజనాంజనేయస్వామి వారి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారంలా ప్రసిద్ధి పొందింది. పుణ్య దినాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. తీరానికి తూర్పు ముఖంగా ప్రతిష్ఠించిన ఈ ఆలయంలో నిత్యం భక్తులు పూజలు చేస్తుంటారు. స్వామి వారి అనుగ్రహం భక్తులపై సదా ఉంటుందని విశ్వసిస్తుంటారు.

రవాణా, వసతి సౌకర్యం

సూర్యలంక తీరానికి విచ్చేసే యాత్రీకులకు రవాణా సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. బాపట్ల పట్టణం నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యలంకను సందర్శించేందుకు ఆర్టీసీ సర్వీస్‌లు, ఇతర వాహనాలు ఉన్నాయి. బాపట్ల రైల్వేస్టేషన్ నుంచి ఇక్కడకు నేరుగా విచ్చేసేందుకు ఆటో సర్వీస్‌లు ఉన్నాయి. పర్యాటకులు సేద తీరేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏసీ కాటేజీలు అందుబాటులో ఉన్నాయి. హరితా బీచ్ రిసార్ట్స్ పేరుతో ఈ సదుపాయాలను పర్యాటక శాఖ అమలు చేస్తోంది. ఇవి కాకుండా అనేక ప్రైవేట్ అతిథి గృహాలు, లాడ్జిలు అందుబాటులో ఉన్నాయి.

జీఎస్‌టీ సంస్కరణలతో దేశంలో ఆర్థిక విప్లవం

ప్రజల ఆర్థిక ప్రగతికి లాభదాయకం

వైద్య, వ్యవసాయ, విద్యా రంగాలకు ఊతం

అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ఆర్థిక విప్లవానికి నూతన జీఎస్టీ సంస్కరణలు అద్భుతంగా దోహదపడతాయని, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశం సందర్భంగా ఆయన జీఎస్‌టీ నూతన సంస్కరణలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. నూతన సంస్కరణలతో ప్రజలు, పరిశ్రమలకు, ఆర్థిక ప్రగతికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో ప్రజలకు పన్నుల భారం నుంచి వెసులుబాటు కలుగుతుందన్నారు. వైద్యం, విద్య, వ్యవసాయం పరిశ్రమల రంగానికి ఊతం ఇచ్చిందన్నారు. 2017లో మొదలైన జీఎస్టీ విప్లవం మొదలైందన్నారు. ఒక దేశం ఒకే పన్ను విధానం ద్వారా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. 2018లో భారతదేశ జీఎస్‌టీ ఆదాయం రూ.7 లక్షల కోట్లు ఉంటే 2020 నాటికి రూ.12 లక్షల కోట్లు అయ్యిందన్నారు. ప్రస్తుతం జీఎస్‌టీ పరిధిలో కోటిన్నర మంది ఉన్నారన్నారు. తద్వారా ప్రభుత్వ మెరుగైన పన్ను విధానాన్ని అమలులోనికి తెచ్చిందన్నారు. క్యాన్సర్ జబ్బులకు వాడే మందులను జీరో ట్యాక్స్‌లోకి తీసుకు వచ్చారని ఇది చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. అత్యవసర మందులపై జీఎస్టీ పన్ను లేకుండా చేయడం హర్షింతగ్గ విషయమన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగే వస్తువుల వినియోగం పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుస్థిర నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడుల వరద వస్తోందన్నారు. అలాగే యువనేత నారా లోకేష్ ఏడాది కాలంలోనే 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించేలా కృషి చేస్తున్నారన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

శతక పద్య పోటీ విజేతలకు జ్ఞాపికలు



గెలుపొందిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

పంగులూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఉన్నత పాఠశాలలో గురువారం మూడు విభాగాలలో మండలస్థాయి శతక పద్యపోటీలు నిర్వహించారు. ప్రాథమికస్థాయిలో రిథిల్‌షాన్ (పంగు లూరు), డోలాంజలి(కోటపాడు), ప్రాథమికోన్నతస్థాయిలో నిఖిత (కోటపాడు), శ్రేష్ఠ(పంగులూరు), ఉన్నత పాఠశాల స్థాయిలో మమత (రేణంగివరం). కీర్తన(పంగులూరు) ప్రథమ, ద్వితీ య స్థానాలు సాధించారు. గెలుపొందిన బాలబాలికలకు ఎంఈవో వీరాంజనేయులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అజిత్‌ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ, హెచ్‌ఎంలు వడ్లమూడి వేణుబాబు, గుర్రంలక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతతోనే రాజ్యాంగ పరిరక్షణ

మాజీ ఎంపీ చింతా మోహన్

టంగుటూరు(కొండపి), సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): దళితులు ఐక్యతతోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. గురువారం సాయంత్రం టంగుటూరులోని అంబేద్కర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అంబేద్కర్‌నగర్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆయన స్థానికులతో మాట్లాడారు. అనంతరం చింతామోహన్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు, రాష్ట్ర నాయకుడు చితామణి, సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర మాలల జేఏసీ నాయకుడు లాయర్ బాల నారాయణ, మేడిద రవి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌నగర్‌లో ర్యాలీగా వెళ్తున్న చింతా మోహన్, నాయకులు

మార్టూరులో భారీ వర్షం



మార్టూరులో పెద్ద ఖానా వద్ద వర్షపునీరు

మార్టూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం దాదాపుగా గంటసేపు భారీ వర్షం కురిసింది. మార్టూరు బొలాపల్లి, కోలలపూడి తాటివారిపాలెం, కోనంకి, వలపర్ల గ్రామాలలో భారీగా వర్షం కురిసింది. దీంతో టోల్‌ప్లాజా సమీపంలోని పొలాల్లో భారీగా వర్షపు నీళ్లు నిలిచాయి. అదేవిధంగా మార్టూరులో పెద్ద ఖానా వద్ద వర్షపునీళ్లు నిలిచాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అయితే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో జాతీయ రహదారి వెంబడి వర్షపు నీరు వెళ్లే విధంగా పనులు చేపట్టారు. దీంతో కొంతమేర సర్వీసు రోడ్లులో నీళ్లు నిలబడకుండా వెళ్లడంతో వాహనదారులు ఊపరిపీల్చుకున్నారు. వర్షంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ విజయ

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను అసిస్టెంట్ కమీషన్ కె.విజయ గురువారం తనిఖీచేశారు. స్థానిక స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసులను త్వరిత గతిన పరిష్కరించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ ఎం.భుజంగరావుకు సూచించారు. షాపుల నిర్వహణలో సమయ పాలన తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్బిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

సంతనూతలపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలలకు ఉన్న హక్కులు , సమస్యలను ఏవిధంగా ఎదుర్కోవాలో జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ సాధికారతాధికారిణి ఎస్.సువర్ణ అవగాహన కల్పించారు. మండలంలోని పేర్నమిట్ట జడ్పీహైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 6నుంచి 18 సంవత్సరాల వయసుగల పిల్లలకు అభివృద్ధిని, సాధికారతను, రక్షణను అందించడం ద్వారా బాల్యవివాహాలు అడ్డుకోవచ్చని తెలిపారు. బాలల హక్కులకు భంగం వాటిల్లితే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 112, 181, 100లకు సమాచారం ఇవ్వవచ్చని బాలబాలికలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షితమైన మందుల వినియోగం ఆరోగ్యకరం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సురక్షితమైన మందులు వాడటం వలన ఆరోగ్యం లభిస్తుందని, తద్వారా మెరుగైన జీవన విధానం అందించవచ్చని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా గురువారం జీజీహెచ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ నిర్ధారిత మందులు వాడకంతో పాటు అనవసరమైన మందుల వాడకం తగ్గించేలా కృషి చేయాలన్నారు. జీజీహెచ్‌కు విచ్చేసే రోగులకు మందుల వాడకంపై విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

మార్టూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చిమ్మిరిబండ గ్రామ పొలాల్లో పిడుగుపడి దుడ్డు కోర్నేలు (58) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 3:30 నిమిషాలకు జరిగింది. గ్రామ వీఆర్‌వో గుమ్మడి నాగు కథనం ప్రకారం.., మృతుడు కొర్నేలు మధ్యాహ్నం సమయంలో తన సొంతపొలంలో వరి విత్తనాలను ఎదపెట్టడానికి వెళ్లిన సమయంలో, పొలంలో పిడుగు పడి మృతి చెందారు. దీంతో అతని శరీరం చాలా వరకు కాలిన గాయాలు ఉన్నాయి. మృతునికి భార్య జయమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారందరికి వివాహమయ్యింది. నెల రోజులు క్రితంవివాహమైన చిన్న కుమార్తె హైదరాబాదులో ఉండడంతో భార్య జయమ్మ అక్కడకు వెళ్లారు. ఈ ప్రమాదంపై వీఆర్‌వో సేకరించిన వివరాలను తహసీల్దార్ టి.ప్రశాంతికి పంపించారు. దీంతో ఆమె నివేదికను తయారుచేసి కలెక్టర్ కు పంపించారు. ఇదిలా ఉండగా చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో చక్రం ఊడి డ్రైవర్‌కు గాయాలు

పేరాల(చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణ సమయంలో అకస్మాత్తుగా ఆటో ముందు చక్రం ఊడి పోవడంతో డ్రైవర్ గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం ఉదయం పేరాల ముత్యాలపేటలో చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం ఆటో డ్రైవర్ ప్రయాణీకులను చీరాల రైల్వే స్టేషన్‌లో దించేందుకు ముత్యాలపేటలో నుంచి వెళుతుండగా అకస్మాత్తుగా ముందుచక్రం ఊడి ఆటో ఓ గోడను ఢీ కొంది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

మందుబాబులతో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తగలబెట్టిస్తున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

టంగుటూరు/కొండపి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు నుంచి రాగాయికుంటకు పోయే దారిలో మందుబాబులు పొలాల్లో మద్యంతాగి వ్యర్థాలను వదిలివేసి పొలాలను చెడగొడుతున్నారు. ఈ నేపథ్యంలో టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు ప్రత్యేక నిఘా ఉంచి మందుబాబులను, ఆకతాయిలను గుర్తించి గురువారం రాత్రి మందుబాబులతో పొలాల్లోని వ్యర్థాలను వారితో తొలగింపచేశారు. వ్యర్థాలను మందుబాబులతో కాల్పించారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. పదేపదే ఇటువంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు. పొల్లాల్లో మద్యం తాగి వ్యర్థాలను పడేసే వారిపై చర్యలు తీసుకున్నందుకు స్థానికులు, పొలాల రైతులు ఎస్సైను అభినందిస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

మార్టూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి బి.హనుమంతనాయక్ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గుచూపితే ఉద్యానశాఖ ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. రైతులు పంట సాగు చేపడితే మంచి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి భాషా, గ్రామ వ్యవసాయసహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

చెత్త రహిత అద్దంకిగా మార్చేందుకు సహకరించాలి



చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు

అద్దంకి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): చెత్తరహిత అద్దంకిగా మార్చేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గరటయ్య కాలనీ వద్ద చెత్త సేకరణ, అద్దంకి కొండ వద్ద డంపింగ్ యార్డులో చెత్తను శుద్ధి చేస్తున్న ప్రాంతాలను లక్ష్మీశ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ రవీంద్రలు గురువారం పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాపరికరాల వితరణ అభినందనీయం

● డిప్యూటీ ఈవో గంగాధర్



క్రీడాపరికరాలను పాఠశాలకు అందజేస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

పంగులూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాలకు పూర్వవిద్యార్థి గోపీకృష్ణ క్రీడాపరికరాలు సమకూర్చడం అభినందనీయమని చీరాల డివిజన్ డిప్యూటీ డీఈవో గంగాధర్ అన్నారు. మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి గోపీకృష్ణ రూ.28వేల విలువైన క్రీడాపరికరాలు సమకూర్చగా, ఆ పరికరాలను డిప్యూటీ ఈవో డి.గంగాధర్ గురువారం పాఠశాల వ్యాయామోపా. ధ్యాయులకు అందజేశారు. పాఠశాల విద్యార్థులు దాతల అందించిన సహకారంతో చదువు, క్రీడలలో ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, పీడీలు, కె.మధు, కె.ప్రతిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో వీరాంజనేయులు

పంగులూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఎంఈవో జి.వీరాంజనేయులు కోరారు. చందలూరు ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. అండర్-17 బాలుర విభాగంలో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీలలో చందలూరు విద్యార్థులు గెలుపొందగా, బాలికల విభాగంలో కబడ్డీలో కొండమంజులూరు, వాలీబాల్ పోటీలో బూదవాడ విద్యార్థినులు గెలుపొందారు. యోగా టీమ్‌ఈవెంట్‌లో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు లిఖిత, భవ్యశ్రీ, శృతి, అమూల్య, హెప్సిబ, సరిత విజయం సాధించారు. చెస్ ఈవెంట్‌లో కొండమంజులూరు విద్యార్థులు చైతన్య వరప్రసాద్, హనుక్‌బాబు, చందలూరు విద్యార్థులు కౌశిక్, పవన్, షమిత్‌నాయుడు గెలుపొందారు. గురువారం జరిగిన మండలస్థాయి పోటీలలో గెలుపొందిన జట్లు 19న పందిళ్లపల్లెలో జరిగే చీరాల డివిజన్‌స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల పీడీలు మధు, ప్రతిమ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో హెచ్ఎం. గిరిజ, అజిత్‌ట్రస్ట్ ఛైర్మన్ వీరనారాయణ, వివిధ పాఠశాలల పీడీలు హనుమయ్య, హరిబాబు, వెంకట్రావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో వలపర్ల హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



క్రీడలలో పతకాలు సాధించిన బాలబాలికలతో ఉపాధ్యాయులు

మార్టూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 16, 17 తేదీలలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలలో వలపర్ల హైస్కూల్ కు చెందిన 20 మంది బాలబాలికలు పతకాలను సాధించినట్లు పీఈటీ రవి దేవరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో అండర్-14 విభాగంలో బాలురు, బాలికలు జట్లు ప్రథమ స్థానాలను గెలుచుకున్నాయి. అదేవిధంగా రన్నింగ్, లాంగ్‌జంప్, చెస్, వాలీబాల్ పోటీలలో బాలబాలికలు మంచి ప్రతిభను కనబరచారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కల్యాణి, పీఈటీలు రవి దేవరాజ్, యోకోబు, విద్యాకమిటి ఛైర్మన్ కే.రమేష్‌లు బాల బాలికలను అభినందించారు.

స్మార్ట్ కార్డులతో బహుళ ప్రయోజనాలు

● లబ్ధిదారులకు అందజేసిన అధికారులు, టీడీపీ నేతలు ● పారదర్శకంగా సులభంగా సరుకులు పొందవచ్చని వెల్లడి

దేవాంగపురి(చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తాజాగా అందిస్తున్న స్మార్ట్ కార్డులతో బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని యువ నాయకులు గౌరీఅమర్నాధ్, తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని దేవాంగపురిలో ప్రజలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ నూతన విధానం ద్వారా సులభతరంగా సరుకులు అందుకోవచ్చని వివరించారు. ప్రభుత్వ పథకాలకు కార్డును గుర్తింపుగా వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే నిత్యవసరాల పంపిణీలో పారదర్శకంగా వీలుంటుందని చెప్పారు. నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



రాజుబంగారుపాలెంలో కార్డులను పంపిణీ చేస్తున్న నేతలు

ఇంకొల్లు : పేదల సంక్షేమమే ప్రజా కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. తహసీల్ధారు కార్యాలయం వద్ద గురువారం స్మార్ట్ రేషన్‌కార్డులను అర్హులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర మాలకార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్‌కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌కార్డులు అందజేస్తామన్నారు. మండలంలో 15,500 స్మార్ట్ రేషన్ కార్డులు ఉన్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, రాష్ట్ర వాణిజ్యవిభాగపు ప్రధాన కార్యదర్శి పాలేరు రామకృష్ణ, ఇంకొల్లు పీఏసీఎస్ ఛైర్మన్ కరి శ్రీనివాసరావు, టీడీపీటౌన్ అధ్యక్షులు మార్క్, చిలుకూరి శ్రీనివాసరావు, బోడెంపూడి సుబ్బారావు, మీరావలి, సీతారామయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

16,931 స్మార్టు కార్డులు

బల్లికురవ : మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో పేదలకు ప్రభుత్వం 16,931 స్మార్టు రేషన్ కార్డులను మంజురు చేసిందని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. ఈ కార్డులను గ్రామాలో ఉన్న రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందజే స్తామన్నారు. గతంలో ఉన్న రేషన్ కార్డుల స్థానంలో ప్రభుత్వం స్మార్టు కార్డులను ప్రవేశపెట్టింద న్నారు.



స్మార్ట్ రైస్‌కార్డులు అందజేస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, అమర్నాథ్

చినగంజాం : మండల పరిధిలోని రాజుబంగారు పాలెం, సోపిరాల గ్రామంలోని చౌకధరల దుకాణాల్లో గురువారం స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్డులతో సరుకులు సులభంగా పొందవచ్చని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్‌ఐ బండారు దానియేలు, రాజుబంగారుపాలెం కార్యదర్శి ఉష, టీడీపీ నాయకులు కోకి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, సందు శ్రీనివాసరావు, వాటుపల్లి ఏడుకొండలు, నరహరి శ్రీనివాసరావు, భోగిరెడ్డి కోటిరెడ్డి రేషన్‌డీలర్లు తదితలరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రజాకూటమి ప్రభుత్వ లక్ష్యం

ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను (సూపర్‌సిక్స్) పథకాలను ప్రజా కూటమి ప్రభుత్వం అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతోందని ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. దీంతో ఓర్వలేని వైసీపీ ప్రభుత్వంపై అసత్యపు ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. గురువారం స్థానిక ఏఎంసీలో పీఏసీఎస్ సొసైటీల అధ్యక్షులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అందుబాటులో ఉన్నా, కొరత ఉందని అసత్య ప్రచారం చేస్తోందన్నారు. యూరియాపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి మరీ ప్రభుత్వం సొసైటీల ద్వారా సరఫరా చేస్తోందన్నారు. ఖరీఫ్ సాగుకు ఎంత అవసరమో ఆ మేరకు నిల్వ లున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కృష్ణ, పర్చూరు పీఏసీఎస్ అధ్యక్షులు కొల్లా చంద్రం, ఇంకొల్లు పీఏ సీయస్ అధ్యక్షులు కరి శ్రీనివాసరావు (గ్యాస్), నాగులపాలెం పీఏసీయస్ అడ్డగడ సుబ్బా రాయుడు, కొణికి పీఏసీయస్ బోడెంపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ వెంకట్రావు

అద్దంకిటౌన్ : రైతులు సమగ్ర ఎరువుల యాజ మాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ జి. రమేష్ అన్నారు. గురువారం మండలంలోని గోవాడ గ్రామంలో రైతులతో కిసాన్ గోష్ఠి కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ దుక్కిలో నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. చివరి దుక్కిలో భాస్వరం ఎరువులు వినియోగించాలన్నారు. భాస్వరం ఎ రువుల వలన పంట వేరు వ్యవస్థ వృద్ధి చెందుతుందన్నారు., వేరు వ్యవస్థ వృద్ధి చెందిన తరువాత మాత్రమే మొక్క నత్రజని ఎరువులను తీసుకుంటుం దన్నారు. చివరి రెండు, మూడో దఫాలో మాత్రమే నత్రజని ఎరువులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ బి. ఏప్రాయిమ్, ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, ఉద్యానశాఖ అధికారిణి ఎస్.దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ ఉద్యాన సహాయకురాలు శ్రీలక్ష్మి, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేష్

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

ఇంకొల్లు, సెప్టెంబరు 18,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్ల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తూ రెండు రోజుల పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్ర, శనివారాలలో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సేవలు నిలిపివేస్తున్నట్లు ఇంకొల్లు మండలంలోని దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తానికొండ ఏలియాజర్, బండ్ల సుబ్బారావు, వంకాయలపాడు శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభుత్వ సాయంపై ఆటోడ్రైవర్ల హర్షం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

అద్దంకి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ లకు ఏటా రూ.15 వేలు జమ చేస్తోందని, ప్రకటించడంతో ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మణికేశ్వరంలో గురువారం సాయంత్రం ఆటోడ్రైవర్లు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, లోకేష్, గొట్టిపాటి రవికుమార్‌ల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిమల్లా, బడావలి, ఈసు, ఆదినారాయణ, రూబేను, రవీంద్ర, రవి, దాసు, ప్రసాద్, మహేష్, చినబాబు, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా ఉంటేనే కార్మికుల సమస్యలకు పరిష్కారం

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వసంతరావు
● ఘనంగా ఆ సంఘం 4వ మహాసభ

వేటపాలెం (చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారమని పలువురు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వసంత రావు పేర్కొన్నారు. ఆ సంఘం మండల 4వ మహాసభ గురువారం రామన్నపేట ఆక్వా అసోసియేషన్ భవనంలో ఇండ్ల బ్రహ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విడిచిపెడుతున్నాయని, పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ బాబురావు, మచ్చ అయ్యప్ప, తన్నీరు శ్రీనివాసరావు తదితర కార్మికులు హాజరయ్యారు.

21 సీఐటీయూ మండల మహాసభ

అద్దంకిటౌన్ : సీఐటీయూ అద్దంకి మండల మహాసభలు 21న సుందరయ్య భవనంలో జరగనున్నాయని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహాసభలను సీఐటీయూ తో పాటు అనుబంధ సంఘాల నాయకులు కూడా విజయవంతం చేయాలన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

అద్దంకిటౌన్ : మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్‌సీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచిందన్నారు. నేటికీ కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించలేదన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు గత జూలైలో జరిగిన సమ్మె కాలానికి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ రవీంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఆదాం, ఉసురుపాటి శామ్యూల్, జ్యోతి వెంకట్రావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం

చీరాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలుచోట్ల అంతరాయం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విఠల్‌నగర్, వైకుంఠపురం, స్వర్ణ రోడ్డు, లైబ్రరీ రోడ్డు, దండుబాట, హరిప్రసాద్‌నగర్, ఉజిలీపేట, జయంతిపేట ఐక్యనగర్, మరియమ్మపేట, కొత్తపాలెం ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, మరమ్మతుల అనంతరం యథావిధిగా సేవలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

రహదారికి తెలుగు యువత మరమ్మతులు

వేటపాలెం (చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలంలో రహదారి మరమ్మతులకు తెలుగుతమ్ముళ్లు నడుం బిగించారు. రహదారి గుంతల మయంగా ఉండి, వాహన దారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో స్వయంగా రోడ్డు మరమ్మతులు నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య స్ఫూర్తితో అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్లు దోగుపర్తి బాలకృష్ణ, కొత్త నాగు, భవానీ శంకర్, తదితరులు చెప్పారు.



మరమ్మతులు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నరేంద్రకుమార్

● ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
● అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి



కొల్లా నరేంద్రకుమార్

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాల సముదాయ సీనియర్, జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది కొల్లా నరేంద్రకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆయన ఇన్‌చార్జ్ ఏజీపీగా ఉన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు, న్యాయవాది వృత్తిలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఏజీపీగా నియమితులైన కొల్లా నరేంద్రకుమార్‌ను స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అభినందించారు. అదేవిధంగా పలువురు న్యాయ వాదులు ఆయనకు శుభాకంక్షలు తెలియజేశారు.

క్రిబ్కో ఛైర్మన్ సుధాకర్ చౌదరితో ఏలూరి భేటీ

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రిషక్ భారతి కో- ఆపరేటివ్ లిమిటెడ్ (క్రిబ్కో) నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన విజయవాడకు చెందిన ప్రముఖ తెలుగు వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరితో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం విజయవాడలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించి, శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఆత్మీయ మిత్రుడు అత్యుత్తమ క్రిషక్ భారత్ కోఆపరేటివ్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియామకం కావడం హర్షించతగ్గ విషయమన్నారు. నిబద్ధత కలిగిన వ్యక్తికి అరుదైన గౌరవం దక్కడం ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణ మన్నారు. యువ పారిశ్రామిక వేత్తలకు సుధాకర్ రోల్ మోడల్‌గా నిలుస్తున్నారన్నారు. రైతు సంక్షేమం అభివృద్ధికి సుధాకర్ చౌదరి కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. ఏలూరితోపాటు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉన్నారు.



సుధాకర్‌చౌదరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

ఏరియా వైద్యశాలలో స్వస్థ నారీ సశక్త్ పరివార్

దేవాంగపురి (చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన మహిళ - శక్తివంతమైన కుటుంబానికి మూలమని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏరియా వైద్యశాలలో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ ఆరోగ్య కోసం స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. యువనాయకులు గౌరీ అమర్నాధ్ మాట్లాడుతూ క్యాన్సర్ వంటి వాటిని ముందస్తుగా గుర్తించి నియంత్రించాలని చెప్పారు. అలాగే ఆస్పత్రుల్లో రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీకాంత్, పలువురు వైద్యులు, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూటీపై చూడ 'ముచ్చు'టగా

అద్దంకి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): కొండముచ్చు స్కూటర్‌పై కూర్చొని దర్జాగా షికారు చేస్తోంది. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద గోవాడకు చెందిన శింగయ్య కొండముచ్చును పెట్టుకొని భక్తులు ఇచ్చే డబ్బులతో గడుపుతుంటాడు. కొండముచ్చు సమీపంలో ఉంటే కోతులు దరిదాపులకు కూడా రావు. అయితే శింగయ్య తన స్కూటర్ పై అద్దంకి వస్తూ కొండముచ్చును కూడా ఎక్కించుకున్నాడు. స్కూటర్ వెనుక వైపు కొండముచ్చు దర్జాగా కూర్చుంది. కొండముచ్చు దర్జాను పలువురు ఆశ్చర్యంగా తిలకించారు.



స్కూటీపై దర్జాగా కూర్చున్న కొండముచ్చు

రక్త దానంతో మరొకరికి ప్రాణదానం : డాక్టర్ సౌమ్య

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదానంతో సమానమని పర్చూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సౌమ్య అన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో నేషనల్ వాలంటీర్ బ్లడ్ డొనేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయటం అభినందనీయం అన్నారు. రక్త దానం చేయటం వల్ల మెరుగైన ఆరోగ్యం కూడా చేకూరుతుందన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సౌమ్య

సరైన ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం

● వేటపాలెంలో ఘనంగా పోషణ మాసం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీడీపీవో

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఆహార అలవాట్లు కచ్చితంగా ఆచరించడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో ఝాన్సీ తెలిపారు. గురువారం వేటపాలెం మండల పరిధిలోని నీలకంఠాపురంలో రాష్ట్రీయ పోషణ మాసం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాలు నివారణకు స్థానికుల సహకారంతోనే సాధ్యమన్నారు. తద్వారా బాలికల అభివృద్ధి సాధ్యమని వివరించారు. గర్భిణులు, బాలింతలకు సంబంధించి పలు సూచనలు చేశారు. పోషణ మాసం గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీరాల ప్రాజెక్టు మేనేజర్ నవీన్, సూపర్‌వైజర్ పుష్పవల్లి, ఏఎన్ఎం సునీత, సీహెచ్‌వో ఏంజిల్, అంగన్వాడీలు అంజనదేవీ, బ్యూలా, మౌనిక, స్రవంతి, పద్మ, లక్ష్మీ, మహిళ పోలీస్ కరుణ, గ్రామ పెద్దలు బుల్లయ్య, సుబ్బారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీడీపీవో, ఏపీఎం

సంతమాగులూరు సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో సుధా పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం హనుమంతరావు అధ్యక్షతన 'భేటీ బచావో, భేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో డి.సుధ మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణచట్టం, సుకన్య సమృద్ధి యోజన పథకం, బాలిక విద్యా ప్రాముఖ్యత పోషణకు సంబంధించిన అంశాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నాగబోతు సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ ఎం సుష్మరాణి, జి.ప్రమీల, బ్లాక్‌ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి ఉమా తదితరులు పాల్గొన్నారు.